
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 14 ఆగస్టు 2024 | 5





# మారని..ప్లాన్!

## ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తే.. అమరావతి నుంచే అనుమతులు

- ప్రభుత్వం మారినా..మారని తీరు
- గత వైసీపీలో అక్కడి నుంచే అన్నీ
- రుడా సమాచారం ఉండదు
- టౌన్ ప్లానింగ్‌కు తెలియదు
- అక్రమార్కులకు అధికారుల అండ
- ఎటు చూసినా అక్రమ నిర్మాణాలే
- నేటికీ నగరంలో సాగుతున్న దందా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- కూటమి మార్చాలని డిమాండ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 13 : అధికారులు కళ్లుండీ చూడలేకపోతున్నారు.. చెవులుండీ వినలేకపోతున్నారు.. అధికారం ఉండీ అరికట్టలేకపోతున్నారు.. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతుంది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పక్కదారి పట్టి కొంతమంది అక్రమార్కుల జేబుల్లోకి పోతుంది. నిబంధనలకు విరుద్ధంగా కట్టిన వాటిని క్రమబద్ధీకరించి ఫైన్ వేయడం ద్వారా ప్రభుత్వానికి కొంత ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే ఉన్న తప్పులను అక్రమాలను దాచిపెట్టే కొంత మంది అధికారులు... మామూళ్ల మత్తులో అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారు. దీంతో నగరంలో ఎటు చూసినా అక్రమ నిర్మాణాలే కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లలో ఈ తరహా నిర్మాణాలు కోకొల్లలు.. ఎందుకంటే ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తే అమరావతి నుంచి అనుమతులొస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఏం జరిగిందో నేటికీ అదే జరుగుతోంది. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరంలో నగరపాలక సంస్థ ఆదీనంలోని పట్టణ ప్రణాళిక విభాగానికి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (రుడా)కి మధ్య సమన్వయలోపం అక్రమార్కులకు వరంగా మారింది.

### రుడా వర్సెస్ టౌన్ ప్లానింగ్

రాజమహేంద్రవరంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలకు వాటి కొలతల ఆధారంగా ఆన్‌లైన్‌లో ప్లాన్ అప్రూవల్స్‌ను రుడా జారీ చేస్తుంది. దీనికి సంబంధించిన సమాచారం అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. అయితే భవనాల అంతస్తులకు సంబంధించిన ప్లాన్ అప్రూవల్స్, నిర్మాణ ప్లింత్ ఏరియా, సెట్‌బాక్స్ సమా చారం వంటివి టౌన్ ప్లానింగ్ వద్దలేవు.దీంతో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు టచ్ చేయలేని పరిస్థితులు ఉన్నాయి. రెండు శాఖల మధ్య సమన్వయ లోపాన్ని ఆసరాగా చేసుకుని కొంత మంది అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.దీని వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలున్నాయి. గతంలో మాజీ ఎంపీ భరత్‌రామ్ పేరు చెప్పి ఒక ముఠా నగరంలో అక్రమ భవన నిర్మాణాలు విచ్చలవిడిగా చేసింది.ప్లాన్లు లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేసుకోమని వారి నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలుచేసిన ఘటనలు ఉన్నాయి. ఆయా నిర్మాణాలు వెలుగులోకి వచ్చిన వెంటనే యాక్షన్ తీసుకోకుండా భవన యాజమానులు కోర్టు వెళ్లి స్టే తెచ్చుకునే వరకు అధికారులు ఆగి సహకరించిన ఘటనలు ఉన్నాయి.

### అంతా పైవాడి దయ..

వ్యవస్థలో ఉన్న లోపాలను వినియోగించుకుని కొంత మంది వక్రమార్గంలో వెళుతున్నారు. వాస్తవానికి రుడా ప్లాన్ అప్రూవల్‌కు వెయ్యి చదరపు గజాల స్థలం నుంచి ఆరంభిస్తారు. వెయ్యిలోపు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు జారీ చేయాలి. కానీ గత ఐదేళ్లలో ఈ పద్ధతికి గత ప్రభుత్వం తూట్లు పొడిచింది. టీడీఆర్ బాండ్ (ట్రాన్స్‌ఫరబుల్ డవలప్‌మెంట్ రైట్స్) కింది 200 చదరపు గజాల స్థలంలో భవనం నిర్మించుకునేందుకు రుడాకు ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకునే వెసులుబాటు రాజమహేంద్రవరంలో ఉంది.ఈ టీడీఆర్ బాండ్లు రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో ఉన్నవారెవరైనా కొనుగోలు చేసుకుని దానిని వారు నిర్మించుకునే భవన నిర్మాణ అప్రూవల్ దరఖాస్తుకు జతచేసి రుడాకి ఆన్‌లైన్‌లో పెట్టుకునే పరిస్థితి ఉంది. ఇలా దరఖాస్తులు సమర్పించిన సమాచారం టౌన్ ప్లానింగ్ అధికారుల వద్ద ఉండడం లేదు. వాస్తవానికి 2019కి పూర్వం ఈ పరిస్థితి లేదు. రుడా ఏర్ప డిన తరువాత గత ప్రభుత్వం విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలకు లేని రూల్ రాజమహేంద్రవరంతో పాటు కొన్ని కార్పొరేషన్లకు పెట్టడం వెనుక పెద్ద ప్లాన్ దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రుడా ప్లాన్ వెయ్యి గజాల లోపునకు ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తే దానిని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఫీల్డ్ తనిఖీలకు వెళ్లి ప్రాథమిక ఆమోదం తెలిపాకే ఆయా ప్లాన్లు అప్రూ వల్ అయ్యేవి. కానీ గత ప్రభుత్వం దీనికి విరుద్ధంగా రాజమహేంద్రవరంతో పాటు కొన్ని మునిసిపాలిటీలకు సంబంధంలేకుండా ఆన్‌లైన్‌లో నేరుగా పైనుంచి అప్రూవల్ అయ్యే విధానం ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఇదే కొనసాగుతుంది. దీని వల్ల టౌన్ ప్లానింగ్ అధికారుల వద్ద నగరంలో రుడాకు దరఖాస్తు చేసుకుని నిర్మాణంలో ఉన్న ఏ భవనానికి సంబంధించిన సమాచారం లేదు.



### విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు

రాజమహేంద్రవరం అడ్డాగా విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు కడుతున్నారు. ప్లాన్ అప్రూవల్స్ ఉంటున్నాయి. కానీ వాటికి విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. నగరంలో షెల్లార్లు లేకుండా అనేక బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. వాటిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలులేవు. గతంలో నగరపాలక సంస్థ కమిషనర్‌గా విజయరామరాజు పనిచేసినప్పుడు ఆయన చాలా డైనమిక్‌గా షెల్లార్లు లేని భవనాలకు నోటీసులు జారీచేశారు. కొన్నింటికి గ్రౌండ్ ఫ్లోర్‌లు ఖాళీ చేయించి షెల్లార్లుగా మార్చిన సందర్భాలు ఉన్నాయి. ఎందుకంటే పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలకు షెల్లార్లు లేకపోతే పార్కింగ్‌లేక వాటి ఎదుట వాహనాలతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పవు. ఇప్పుడు నగరంలో జేఎన్‌రోడ్డు, తిలక్ రోడ్డు, మెయిన్‌రోడ్డు, దానవాయిపేట, ప్రకాశ్‌నగర్ తదితర ప్రాంతాల్లో షెల్లార్లు లేని భవనాలు అనేకం ఉన్నాయి. వాటికి అనుమతులు ఎలా ఇచ్చారో అర్థంకాని పరిస్థితి ఉంది.నగరంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భవన నిర్మాణాలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. వాటిలో జేఎన్ రోడ్డు, తిలక్‌రోడ్డు, సదరన్ స్పైస్ చుట్టుపక్కల నిర్మాణంలో ఉన్న భవనాల్లో చాలా లోపాలు ఉన్నాయి. సెట్‌బాక్స్‌లు,షెల్లార్లు,అనుమతికి మించి శ్లాబ్‌లు వేసేశారు.వాటిని తనిఖీ చేసి చర్యలు తీసుకునే నాథులే లేరు. కొంత మంది అక్రమార్కులు ఇప్పుడు ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి వారిపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు.

రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, విద్యార్థులు... బీజేపీ బైక్ ర్యాలీలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, నల్లమిల్లి

## వినువీధుల ఎగిరింది జెండా...

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 13 : ప్రతి భారతీయుడిలో దేశ భక్తిని పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను జిల్లాలో స్ఫూర్తివంతంగా నిర్వహించుకుంటున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలో వైజంక్షన్ నుంచి మునిసిపల్ కార్యాలయం అంబేడ్కర్ విగ్రహం వరకు మంగళవారం కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ సమైక్యత సమగ్రతను కాపాడడం మనందరి బాధ్యత అన్నారు. అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్ధేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, టూరిజం ప్రాంతీయ ఉపసంచాలకులు స్వామినాయుడు, డీఈవో కె వాసుదేవరావు, సెంట్రల్ జోన్ డీఎస్పీ కే.రమేష్ బాబు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ అర్బన్ బి.దిలీప్ కుమార్, జిల్లా స్పోర్ట్స్ అధికారి బివివి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 13 : బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరంలో జాతీయ జెండాలు చేతపట్టి హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏవీ అప్పారావు రోడ్డులోని రామాలయం సెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండు వరకూ బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులతో కలిసి ర్యాలీ జరిపారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కందికొండ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో ఎంపీ పురందేశ్వరి పర్యటన


రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 13 : రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి బుధవారం కొవ్వూరు, రాజమహేంద్రవరం, కడియం నియోజకవర్గాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి రానున్న పురందేశ్వరి 9 గంటలకు కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం పోచవరం, రాగాలపల్లి గ్రామాల్లో పర్యటిస్తారు. కొవ్వాడ కాలువ ఉధృతికి నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకూ రాజమహేంద్రవరం ఎంపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. అనంతరం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జరిగే బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దుర్గేష్, పలువురు కూటమి ఎమ్మెల్యేలతో కలసి పాల్గొంటారు.సాయంత్రం ఐదు గంటలకు కడియం మండలం వీరవరం జీఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ సత్కారోత్సవంలో పాల్గొంటారని ఎంపీ కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

## 20 నుంచి కొత్త ఓటర్ల నమోదు

రాజమహేంద్రవరం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20 నుంచి అక్టోబరు 18 వరకూ స్పెషల్ సమ్మరి రివిజన్ -2025 చేపట్టాలని, బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి 18-19 ఏళ్ల వయస్సు ఉన్నవారిని ఓటర్లు చేర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వివేక్‌యాదవ్ జిల్లా కలెక్టర్లతో ఎస్ఎస్ఆర్ రూపకల్పన, ఫొటో ఓటరు జాబితా, తదితర అంశాలపై మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. ప్రతి ఏడాది జనవరి, ఏప్రిల్,జూలై,అక్టోబరు ఒకటో తేదీల్లో కొత్తగా 18 ఏళ్లు నిండిన వారి పేర్లను ఓటర్లుగా నమోదు చేస్తున్నామన్నారు. ఈ నెల 20 నుంచే బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ చేపట్టాలన్నారు. కొత్త ఓటరు నమోదు, తొలగింపు,చిరునామా మార్పునకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి శుక్రవారం సమావేశాలు నిర్వహించాలని,అక్టోబరు 19 నుంచి 20 వరకూ సమీకృత నమూనా ఓటరుజాబితా సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఓటర్ల జాబితా అక్టోబరు 29న ప్రచురించి,నవంబరు 28వ తేదీ వరకూ వాటిపై అభ్యంతరాలు స్వీకరించి,డిసెంబరు 24వతేదీ లోపు పరిష్కరించాలన్నారు.కార్యక్రమంలో ఆర్‌వోలు కమిషనర్ కేతన్ గర్గ్, సబ్- కలెక్టర్ అశుతోశ్ శ్రీవాత్సవ,డీఆర్‌వో జి.నరసింహులు,ఎస్‌డీసీకెల్ శివజ్యోతి,ఎస్‌డీసీ ఎం. మాధురి, ఎస్‌డీసీఆర్‌వీ.రమణనాయక్, ఎస్.సరళావందనం పాల్గొన్నారు.


## ఇసుక కొరత తీరేదెన్నడో? 7



## చూడండి సారూ.. ఇదీ తీరు!

ప్రభుత్వాసుపత్రికా మేం రాం బాబోయ్.. ఇదీ చాలా మంది మాట.. ఎందుకంటే అక్కడ సరైన సౌకర్యాలుండవ్.. అసలు పట్టించుకోరు.. మన చావు మనం చావాల్సిందే.. ఈ మాటలు ఎప్పుడు అన్నా.. నేటికీ ప్రభుత్వ ఆసుపత్రులు అలాగే ఉన్నాయి.. సోమవారం రాత్రి 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కిన ఈ చిత్రాలే నిదర్శనం.. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోనివి.. ఒకే బెడ్‌పై ఇద్దరు పడుకుని ఉన్న ఈ వార్డు ఏమిటో తెలుసా..ఐసీయూ అయినా ఇంతే.. అదే ప్రైవేటు ఆసుపత్రిలో అయితే ఐసీయూలో ఏ ఒక్కరినీ అడుగుపెట్టనీయరు.. ఇక్కడ మాత్రం ఇలా ఒకే బెడ్‌పై ఇద్దరు.. అయినా ఉన్నతాధికారులకు పట్టదు.. ఆసుపత్రిలో కనీసం వీల్‌ఛైర్ పట్టుకునేందుకు సిబ్బంది కానరావడంలేదు.. రోగుల బంధువుల చేసుకోవాల్సిందే.. ఎక్కడికి కావాలంటే అక్కడికి వీల్‌ఛైర్‌లో తీసుకెళ్లాల్సిందే.. వీల్‌ఛైర్ లేదంటే భుజాలపై మోసుకెళ్లాల్సిందే.. ప్రతి రోజూ ఇటువంటి సిత్రాలు కోకొల్లలు..అయినా పాలకులూ పట్టించుకోరెందుకో మరి..! - **(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)**

## జీడీఏ ఉద్యోగికి షోకాజ్ నోటీసు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 13 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏ)గా పనిచేస్తున్న ఓ ఉద్యోగికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ మంగళవారం షోకాజ్ (సంజాయిషీ) నోటీసు జారీ చేశారు.రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.జీడీఏగా పనిచేస్తున్న డి.గౌతమ్ రాంజీపై సూపర్‌వైజర్ ఆర్‌వీకే భీమేశ్వరరావు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.ఇదిలా ఉంటే కొద్దిరోజుల కిందట సదరు జీడీఏ వ్యవహారశైలిపై పలువురు ఎంఎన్‌వోలు, జీడీఏలు విచారణాధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు చేయడం గమనార్హం. సూపరింటెండెంట్ జోక్యం చేసుకుని సహోద్యోగులు, రోగులతో వ్యవహరించే పద్ధతి మార్చుకోవాలని మందలించి వదిలేసినా అతని తీరు మారకపోవడంతో తాజాగా ఉన్నతాధికారులు సంజాయిషీ నోటీసు జారీచేశారు.దీనిపై జీజీహెచ్ ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది.


## అనుమానంతో హత్య

## అధికారుల నిర్లక్ష్యం.. బయటకు రాని నావ 7



## పుష్కరాలకు ప్రణాళిక రూపొందించండి

### కలెక్టర్ ప్రశాంతి



పుష్కరాలపై చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 13 : రాజమహేంద్రవరంలో 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ఒక ప్రణాళిక రూపొందించి దాని ప్రకారం చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్‌లతో వివిధ అంశాలపై కలెక్టర్ చర్చించారు. పుష్కరాలకు ప్రణాళిక సిద్ధం చేసి వాటి అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేయాలన్నారు. మెయిన్‌రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనే జీ వ్యవస్థ ఏర్పాటుకు చేసిన ప్రతిపాదనలు, కంబాలచెరువు ప్రాంతంలో ముంపు సమస్యకు పరిష్కారం, ప్రధాన రహదారులు వెడల్పు చేయ డం, ట్రాఫిక్ సమస్య అధిగమించడం వంటి పనులు చేపట్టాలన్నారు.ఆయా సమస్యలను అధిగమించడం సాధ్యమవుతుందని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఇప్పటికే తాను విస్తృత స్థాయిలో పర్యటించిన డ్రైనేజీ వ్యవస్థ, రహదారులపై ఒక అవగాహనకు వచ్చినట్టు స్పష్టం చేశారు. ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం, నగరంలో రోడ్ల వెడల్పు చేయడం,ట్రాఫిక్ దారి మళ్లింపుపైన, ప్రత్యామ్నాయ మార్గాలపైనా ఒక కొలిక్కి వచ్చినట్టు చెప్పారు.



## ఆకట్టుకున్న గాంధీజీ చిత్రం

బ్రిటీషు వారిని ఎదురించి భారతదేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు గాంధీజీ. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈదరాడ హైస్కూలు డ్రాయింగ్ టీచరు బత్తుల శ్రీనివాస్ ఆయిల్ పెయింట్‌తో గీసిన మహాత్ముని చిత్రం ఆకట్టుకుంది. శ్రీనివాస్‌ను హెచ్ఎం జి.సాయిబాబుతో పాటు సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

- మామిడికుదురు

## చింతలమోరిలో 300 మీటర్ల జెండా ప్రదర్శన


చింతలమోరిలో భారీ జాతీయ జెండాను ఊరేగిస్తున్న విద్యార్థులు

మలికిపురం, ఆగస్టు 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం చింతలమోరిలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డొక్కా నాథ్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం హైస్కూలు విద్యార్థులు 300మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. జాతీయతా భావాన్ని పెంపొందించడానికి ప్రధాని పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టినట్టు నాగబాబు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, అడబాల సత్యనారాయణ, అడబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## 336 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ


336 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెద్దాపురం, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాకినాడజిల్లా పెద్దాపురంలో 336 అడుగుల జాతీయ జెండాను విద్యార్థులు మంగళవారం ప్రదర్శించారు. ఈ భారీ జెండాను పట్టణ వీధుల్లో ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లి స్థానిక మున్సిపల్ జంక్షన్‌వద్ద మానవహారంగా ఏర్పడి జాతీయజెండాను ప్రదర్శించారు. ఈ జెండా ప్రదర్శన కార్యక్రమంలో ఎస్ఐ మౌనిక పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతీఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు.

# ఇసుక కొరత తీరేదెప్పుడో?


(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- 17 డీసిల్టేషన్ ర్యాంపుల గుర్తింపు... ఇంకనూ లభించని అనుమతులు
- ఇరిగేషన్‌కు బ్యారేజీ నుంచి ఫోర్త్ బ్రిడ్జిలోపు ర్యాంపుల నిర్వహణ
- ఫోర్త్ బ్రిడ్జి అవతల మైన్స్‌కు అప్పగింత ● ఈ వారంలో మొదలు కానట్టేనా?
- ఇసుకకు వినియోగదారుల ఎదురుచూపు

ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించాయి. జూలై 8 నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చినప్పటికీ, ఇంకా ఇసుక తీత మొదలు కాలేదు. గత ప్రభుత్వం హయాంలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వేసి, మళ్లీ వాళ్ల ప్రభుత్వమే వస్తుందనే దురాశతో జిల్లాలో పలు చోట్ల ఇసుకను స్టాక్ చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక విధానం ప్రకటించి మొదట ఈస్టాక్ పాయింట్లలోని ఇసుకను సరఫరా చేశారు. జిల్లాలో ఇంచు మించు ఇసుక స్టాక్ అయిపోయినట్టే. రాజమహేంద్రవరం డివిజన్‌లో అసలు లేదు. కొవ్వూరు డివిజన్‌లో కూడా రేపోమాపో అంతా ఖాళీ. ఈ పరిస్థితులలో ఇసుక కొరత లేకుండా చూడాలని ప్రభుత్వం, జిల్లా ఇసుకకమిటీ ప్రయత్నాలు చేస్తోంది. కానీ నిబంధనలు అడ్డు వస్తున్నాయి. వీటిపై స్పష్టత రాగానే కొంతమేరైనా ఇసుక తీత తీసే అవకాశం ఉంది. ప్రస్తుతం వరద కారణంగా ఓపెన్ రీచ్‌ల జోలికి వెళ్లడంలేదు. ఇసుక కొరత లేకుండా చూడడం కోసం అఖండ గోదావరిలో డీసిల్టేషన్ ద్వారా ఇసుకతీసి సరఫరా చేయడానికి నిర్ణయించారు. రాజమహేంద్ర వరం, కొవ్వూరు ప్రాంతాల్లో మొత్తం 17డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. వీటిని ఎవరికి అప్పగించాలి, ఎవరితో ఎలా ఇసుక తీయించాలనే దానిపై స్పష్టతకు అధికారులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం ఈ పాయింట్లను క్లస్టర్లుగా విభజించి, ఆన్‌లైన్ టెండర్లు పిలవాలని చూస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గోదావరి ఫోర్త్ బ్రిడ్జి అయిన గామన్‌బ్రిడ్జి వరకూ రాజమహేంద్ర వరం, కొవ్వూరు ప్రాంతాల మధ్య అఖండగోదావరిలో డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా ఇసుక టెండర్లు పిలవడం, తీయించడం, సరఫ రా చేయించే బాధ్యత ఇరిగేషన్ శాఖకు ప్రభుత్వం అప్పగించింది. గామన్ బ్రిడ్జి అవతల డీ సిల్టేషన్ పాయింట్ల నిర్వహణ బాధ్యతను మైన్స్ డిపార్ట్ మెంట్‌కు అప్పగించింది. గతంలో మాదిరిగా ర్యాంపులకింద కాకుండా రాజమ హేంద్రవరంఅర్బన్, రాజమహేంద్రవర రూరల్, వెంకటనగర్, వాడపల్లి, ఎర్రమ్మఘాట్, అరికిరేవుల, దొండగంటి రేవు, తాళ్లపూడి, ప్రక్కిలంక తదితర డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.268 కోట్ల విలువైన ఇసుక డ్రెడ్జింగ్ ఆర్డర్ పొందిన రామవా కన్‌స్ట్రక్షన్ కొనసాగించాలా, వద్దా అనే దానిపై కూడా స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ కంపెనీకి అనుమతిస్తే డ్రెడ్జింగ్ ద్వారా కరవుతీరా ఇసుక తీసే అవకాశం ఉంది. అప్పట్లో అఖండ గోదావరిని డ్రెడ్జింగ్‌తో కుళ్లబొడిచి, పర్యావరణాన్ని దెబ్బతీసిన సంగతి తెలి సిందే. కనీసం ఎంత ఇసుక తవ్వారో, ఎంత అమ్మారో అనే బిల్లులులేకుండా చేశారు. కానీ ఇవాళ అసలు ఇసుక ను ఇరిగేషన్ ఆధ్వర్యంలో తీయించాలా, మైన్స్ ఆధ్వర్యంలో తీయించాలనే విష యం మీద పెద్ద చర్చ జరిగింది. అందుకే అన్ని నిబంధనలు పాటిస్తూ బ్యారేజీ నుంచి ఫోర్త్ బ్రిడ్జి వరకూ ఇరిగేషన్, తర్వాత మైన్స్‌తో పనిచేయ డానికి నిర్ణయించారు. గతంలో మైన్స్‌లేదు.. ఇరిగేషనూ లేదు. వైసీపీ ఇష్టానుసారం జరిగింది. ప్రభుత్వం నుంచి స్పష్టతరాగానే టెండర్లు పిలిచి ఇసుకతీత ప్రారంభించనున్నారు. ఈ వారం మధ్యలో రెండు పబ్లిక్ హాలీడేలు ఉండడంవల్ల వచ్చేవారం వరకూ ఇసుకతీత, సరఫరా ప్రారంభం కాకపోవచ్చు. కానీ రేపోమాపో ఆర్డర్ వస్తే కొంత త్వరగానే ప్రారంభించే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో భవన నిర్మాణదారులు కొంత ఓపిక పట్టాల్సిందే.

> ఇసుక కొరత ఇప్పుడే తీరేలా లేదు. నిబంధనల ప్రకారం ఏదైనా పని చేయాలంటే ఎంతకష్టమో ఈ ఇసుక విధానం చూసి అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం నిబంధనలన్నీ తుంగలో తొక్కి అధికా రుల నోటిపై వేలు పెట్టుకోమని బెదిరించి, ఇసుక ఇష్టానుసారం దోచేసి, అమ్ముకుని, రూ.కోట్లు గడించిన సంగతి తెలిసిందే. రూ.కోట్లు అక్రమాలు జరిగినా ఒక్క అధికారి కూడా మాట్లాడలేదు. ఇవాళ తెలుగుదేశం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయడానికి అనేక నిబంధనలు తెరమీదకు వచ్చాయి. అధికారులు అనేక చట్టాలను వెలికితీసి చూపిస్తున్నారు. అన్ని అనుమతులు ఉంటేనేగానీ ఇసుక తీయలేమని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం కూడా అధికారుల మాటకు విలువ ఇచ్చే. ఒకటి రెండు రోజులు ఆలస్యమైనా పద్ధతి ప్రకారమే ఉచిత ఇసుక అమలు చేసి, ఎక్కడా ఎవరికీ అందలేదనే చెడు రాకుండా చూడాలని స్పష్టంచేస్తోంది.

### కాకినాడ జేఎన్టీయూకు 101-150 ర్యాంక్ బ్యాండ్‌లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు

జేఎన్టీయూకే, ఆగస్టు 13: కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ విడుదలచేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2024 ర్యాంకింగ్స్‌లో కాకినాడ జేఎన్టీయూకే విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విభాగంలో 101-150 ర్యాంక్‌బ్యాండ్‌లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను గూర్చి వివరించారు. గతేడాది ఎన్ఐఆర్ఎఫ్- 2023లో కూడా ర్యాంకింగ్స్‌లో వర్సిటీ 101-150 ర్యాంక్‌బ్యాండ్‌లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించిందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 50-100 ర్యాంక్‌బ్యాండ్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు యూనివర్శిటీలోని రెగ్యులర్ అధ్యాపకులకు పూర్తిస్థాయి రీసెర్చ్ స్కాలర్‌ను కేటాయిస్తామని తెలిపారు. విదేశీ విద్యార్థుల ప్రవేశాలను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపడతామని, ఎంటెక్,పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులను మరింత ప్రోత్సహిస్తామని ఫ్యాకల్టీ స్టూడెంట్ రేషియోను పెంచేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. వర్సిటీలో చేపట్టే ప్రతీ కార్యక్రమంలోనూ లింగ సమానత్వాన్ని పాటించడం ద్వారా ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు సాధించవచ్చని రిజిస్ట్రార్ వివరించారు.

## బి.ప్రత్తిపాడులో విజిలెన్స్ అధికారుల తనిఖీ

- 31.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పిఠాపురం రూరల్, ఆగస్టు 13: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. వాహనం ద్వారా రేషన్‌బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వ్యాన్‌లో తరలిస్తున్న 31.50 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రేషన్‌బియ్యం విలువ రూ.8.93లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఆకుల గంగరాజుపై పిఠాపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేశారు. విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీల్లో ఎస్ఐ టి.జగన్నాథరెడ్డి, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దారు ఎం.వీరాస్వామి, కానిస్టేబుల్స్ శివ, లోవరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


వాహనంలో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

## కాకినాడ పోర్టులో మరో రెండు చెక్‌పోస్టులు

- పోర్టు కార్మికులకు ఇబ్బంది లేకుండా చర్యలు
- అవినీతి కార్యక్రమాలు జరగకుండా ప్రక్షాళన
- పోర్టు కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా చర్యలు
- రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 13: రోజుకు వెయ్యి నుంచి పదకొండు వందల లారీల బియ్యం ఎగుమతులు అయ్యే విధంగా పోర్టులో మరో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ నగరం ఎమ్మెల్యే వనమాడి కొండబాబులతో కలిసి ఆయన కాకినాడ యాంకరేజ్ పోర్టు కార్యకలాపాలపై సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కాకినాడ పోర్టులో రోజువారీ కార్యాకలాపాలకు ఇబ్బంది లేకుండా, కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోర్టులో అవినీతి కార్యకలాపాలు జరుగకుండా ప్రక్షాళన చేస్తున్నామన్నారు. అదనంగా రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు టెక్నికల్ సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. ఏ ఒక్కరిపై కక్ష లేకుండా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 1.45కోట్ల రేషన్‌కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కాకినాడ యాంకరేజ్ పోర్టును పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేసిందన్నారు. పేదలకు చెందిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రీసైక్లింగ్ చేసి విదేశాలకు తరలించారన్నారు. గతనెలలో జరిగిన దాడుల్లో 50వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. దీనిలో 26వేల మెట్రిక్ టన్నుల బియ్యం కెర్నెల్స్ కల్గిన పోర్టిఫైడ్ పీడీఎస్ బియ్యంగా గుర్తించామన్నారు. ప్రభుత్వం కిలో బియ్యం రూ.43కు కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఉచితంగా ఇస్తూంటే ఆ బియ్యాన్ని బియ్యం మాఫియా కిలో ఏడు రూపాయలకు కొనుగోలుచేసి రీసైక్లింగ్ చేసి అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నారని ధ్వజమెత్తారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం కల్గిన 13 మందిపై 6ఏ కేసులతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేశారన్నారు. కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ పోర్టులో కార్యకలాపాలు సక్రమంగా జరిగే విధంగా అన్నిచర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఈనెల ఐదో తేదీన పోర్టులో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ నగరం ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ కాకినాడ పోర్టులో ఎగుమతులు, దిగుమతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తొలుత కలెక్టరేట్‌లో పోర్టు అధికారులు, ఎగుమతిదారులు, లేబర్ యూనియన్లతో సమావేశమయ్యారు. అనంతరం కాకినాడ పోర్టు బొంబాయి గేటు వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ రామ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్, డీసీ లీగల్ మెట్రాలజీ జనార్దనరావు, ఆర్డీవో కిషోర్, సివిల్ సప్లయిస్ డీఎం బాలసరస్వతి, కాకినాడపోర్టు అధికారి ధర్మశాస్త్ర, డీఎస్పీ హనుమంతురావు, పౌరసంబంధాలశాఖ డీడీ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


అవుట్ గేటు వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

# అధికారుల నిర్లక్ష్యం

- నేటికీ బయటకురాని డ్రెడ్జింగ్ నావ
- గేటు మూయడానికి, సాఫ్ట్ లాక్ గేటు ఏర్పాటుకు అడ్డంకిగా మారిన బోటు
- నావ మునిగి 23 రోజులైనా పట్టించుకోని హెడ్‌వర్క్స్ ఈఈ.. ● బ్యారేజీలో తగ్గుతున్న నీరు
- మునిగిన పడవను పరిశీలించిన డెల్టా సీఈ, ఇరిగేషన్ ఎస్ఈ

ధవళేశ్వరం, ఆగస్టు 13: గోదావరి నీటిమట్టం పెరగడంతో లంగరు వేసిన ఇసుక డ్రెడ్జింగ్ నావ ప్రవాహానికి కొట్టుకు వచ్చి కాటన్ బ్యారేజ్ 1వ గేటును ఢీకొట్టి గేటుకు అడ్డంగా మునిగిపోయి 23 రోజులు గడిచినా ఇప్పటికీ నావ అలాగే మునిగి ఉంది. దానిని బయటకు తీయడానికి యజమాని రకరకాలుగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. గోదావరికి వరద ప్రవాహం పెరగడంతో ఇరిగేషన్ అధికారులు ప్రయత్నాలు నిలిపివేశారు. బ్యారేజీ గేటు వద్ద నావ మునిగి గేటును ఆపరేట్ చేయడానికి అడ్డంకిగా మారినా.. బ్యారేజ్‌ను పర్యవేక్షించాల్సిన హెడ్‌వర్క్స్ ఈఈ మొక్కుబడిగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లిపోవడం గమనార్హం. ఈ సంఘటన కలెక్టర్ దృష్టికి వెళ్లి బ్యారేజ్ గేటుకు ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించినా డివిజన్ అధిపతిగా సలహాలు, సూచనలు ఇస్తూ పర్యవేక్షించాల్సిన హెడ్‌వర్క్స్ ఈఈ బ్యారేజ్ సెక్షన్ ఏఈలకు నావను బయటకు తీయించే బాధ్యతను అప్పగించి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోదావరిలో నీరు తగ్గుతూ ఉండటంతో గేట్లను దించి నీటి విడుదలను నియంత్రించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఏ విధంగానైనా అక్కడి నుంచి నావను తీయాల్సిన పరిస్థితుల్లో మంగళవారం ఉదయం డెల్టా సీఈ ఎన్.పుల్లారావు, సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కలిసి నావ మునిగిన ప్రాంతాన్ని పరిశీలించి నావను బయటకు తీయడానికి నావ ఓనర్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఏఈలకు సూచించారు. అలాగే నావను బుధవారం నాటికి బయటకు తీయని పక్షంలో ముక్కలుగా తీసి తొలగించాల్సి ఉంటుందని నావ యజమానులను హెచ్చరించారు.


బ్యారేజీ గేటు వద్ద మునిగిన నావను బయటకు తీయడానికి తీస్తున్న ప్రయత్నాలు



- అవగాహన లేని అధికారులతోనే తంటా

డెల్టాపై అవగాహన లేని అధికారులు డివిజన్లకు అధిపతులుగా రావడంతో వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యల్లో గందరగోళం నెలకొంటుంది. కాటన్ బ్యారేజీ గేట్ల నిర్వహణపై దృష్టిపెట్టకపోవడంతో వరదల సమయంలో గేట్లు మొరాయించిన పరిస్థితులు నెలకొంటున్నాయి

### అనుమానం.. పెనుభూతమై

## భార్యను హత్య చేసిన భర్త

### సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ఘటన

సీతానగరం, ఆగస్టు 13: ఆమె అందమే ఆమెకు శత్రువైంది. అనుమానపు భర్త చేతిలో హత్యకు కారణమైంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి తన భార్యను దారుణంగా హత్యచేశాడు. స్థానికుల వివరాల ప్రకారం.. దేవీపట్నం మండలం దండంగి గ్రామానికి చెందిన చాట్ల జాను, అంగులూరుకు చెందిన దివ్య భారతి(30) భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో ప్రభుత్వం లోతట్టు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించడంతో జాను కుటుంబం పురుషోత్తపట్నం వచ్చి ఓ కాలనీలో జీవనం సాగిస్తున్నారు. భారతి అందంగా ఉండడంతో మొదటి నుంచి జాను అనుమానం కలిగి ఉన్నాడు. ఈ క్రమంలో ఆమెను ఇబ్బందులకు గురిచేస్తుండడంతో గతంలో ఒకసారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొంతకాలం కోర్టులో నడిచింది. తరువాత పెద్దల మధ్య సర్దుబాటు చేసుకున్నారు. అయినప్పటికీ అనుమానం పోలేదు. భారతి తల్లి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా సేవలు చేసేందుకు వెళతానని భర్తను కోరగా అందుకు ఒప్పుకోలేదు. అయినా తల్లిపై మమకారంతో ఆసుపత్రికి వెళ్లింది. దీంతో మళ్లీ ఇద్దరి మధ్య తగవు జరగడంతో విసిగిపోయిన భారతి తన భర్తతో జీవితం ఇలానే ఉంటుందని ఇక కాపురం చేయలేనని విడాకులకు ప్రయత్నాలు చేపట్టింది. దీంతో ఆగ్రహానికి గురైన జాను మంగళవారం ఉదయం తొర్రిగడ్డ పాత పంపింగ్ స్కీమ్ వద్ద బహిర్భూమికి వెళ్లిన భార్యపై పోటకత్తితో వెనుక నుంచి తల, మెడపై నిర్ధాక్షిణ్యంగా నరికి చంపాడు.ఈ ఘటనపై మృతురాలి తండ్రి సరిపల్లి చిట్టియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ సమర్పణరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.


మృతిచెందిన దివ్య భారతి

## డీజిల్ ట్యాంకర్ నుంచి ఎగసిపడిన మంటలు

- ఆందోళనలో స్థానికులు, డ్రైవర్ పరార్
- అదుపుచేసిన అగ్నిమాపక దళాలు


ట్యాంకర్‌పై మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక దళాలు

తాళ్లరేవు, ఆగస్టు 13: విశాఖపట్నం నుంచి యానాం వస్తున్న డీజిల్, పెట్రోల్ ట్యాంకర్ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో మంగళవారం స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు అయ్యప్పస్వామిగుడి ప్రాంతం 216 జాతీయరహదారిపై ట్యాంకర్ వెనుక భాగంలో టైర్లుపేలిపోయి కాలిపోయి మంటలు ఎగసిపడ్డాయి. మంటలను గమనించిన ట్యాంకరు డ్రైవరు పరారై కోరింగ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ ప్రాంతంలో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాకినాడ, జగన్నాథపురం, యానాం, రిలయన్స్ అగ్నిమాపక దళాలు సంఘటనా స్థలానికి చేరుకుని ఫోమ్ రసాయనంతో మంటలను అదుపు చేశాయి. ట్యాంకర్ సాంకేతిక లోపంవల్ల డీజిల్ వాహనం నుంచి భారీగా లీకైంది. దీంతో ప్రత్యామ్నాయంగా బొలేరా వాహనంలోకి డీజిల్‌ను కొంతవరకు తరలించారు. కోరింగ ఎస్ఐ సత్యనారాయణ 216రహదారిపై ట్రాఫిక్‌ను నిలివేసి ప్రయాణికులకు ఎటువంటి అంతరాయం కలుగకుండా తాళ్లరేవు మెయిన్‌రోడ్డుకు వాహనాలను మళ్లించారు. తాళ్లరేవు ఇరుకురోడ్డు కావడం అదే సమయానికి స్కూల్స్ వదలడంతో వాహనాలు ఇరుకురోడ్డులో ఎదురుపడి రాకపోకలు స్తంభించాయి. అగ్నిమాపక బృందాలు, కోరింగ పోలీసులు ఎటువంటి ప్రమాదం జరుగకుండా చర్యలు చేపట్టడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.



## కుంట ఎస్ఐ సస్పెన్షన్

- విలేకరులపై కుట్ర కోణమే కారణం!

చింతూరు, ఆగస్టు 13: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మాజిల్లా కుంట పోలీస్ స్టేషను ఎస్ఐ అజయ్ సోంకర్‌పై మంగళవారం కేసు నమోదైంది. వెనువెంటనే ఎస్ఐని సస్పెండ్ చేసినట్లు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ గంగారావ్‌చౌవాన్ పేర్కొన్నారు. విలేకరులను గంజాయి కేసులో ఇరికించడం వెనుక ఎస్ఐ పాత్ర ఉందన్న ఆరోణలు వినవస్తున్నందున పూర్తిస్థాయి విచారణ జరిపిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ముందుగా ఆరోపణలను ఎదుర్కొంటున్న ఎస్ఐని సస్పెండ్‌చేసి కేసు నమోదు చేశామన్నారు. అల్లూరిసీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు సోమవారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నలుగురు వ్యక్తులను గంజాయి కేసులో నిందితులుగా పేర్కొంటూ అరెస్టు చేసిన విషయం విధితమే. కాగా అరెస్టు అయిన నలుగురు వ్యక్తులు కూడా ఛత్తీస్‌గఢ్‌లోని వివిధ పత్రికలకు విలేకరులుగా వ్యవహరిస్తున్నారు. విలేకరుల అరెస్టు వెనుక కుంట ఎస్ఐ కుట్ర కోణం దాగి ఉన్నదన్న ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. దీంతో ఛత్తీస్‌గఢ్‌లో జర్నలిస్టు సంఘాలు తీవ్ర నిరసనకు దిగాయి. అదే దశలో ఆ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగింది. ఇక జర్నలిస్టుల నిరసన గొంతుకు ఆ రాష్ట్ర ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం తన గొంతును కలిపింది. ఇటు మన రాష్ట్రంలో కూడా జర్నలిస్టు సంఘాలు విలేకరులపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదంటూ నిరసన వ్యక్తం చేసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు చేపట్టిన విచారణలో ఎస్ఐ పాత్ర, కుట్ర ఉందన్న విషయం స్పష్టమైన క్రమంలో కుట్రకు గల కారణాలు ఆ కుట్రలో ఎవరెవరు భాగస్వాములో కూడా తేటతెల్లమయ్యే పరిస్థితి లేకపోలేదన్న అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి.


సుక్మాలో విలేకరుల అక్రమ అరెస్టుని నిరసిస్తూ ఎస్ఐ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జర్నలిస్టు సంఘాలు

## రెండు వేర్వేరు కేసుల్లో 80 కేజీల గంజాయి పట్టివేత

మోతుగూడెం, ఆగస్టు 13: ఎస్పీ అమిత్‌బర్ద్ ఆదేశాలతో గంజాయి నిర్మూలనలో రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికలో భాగంగా మోతుగూడెం పీఎస్ పరిధిలో పోలీసులు విస్తృత వాహనాల తనిఖీలుచేసి రెండు వేర్వేరు కేసుల్లో 80 కేజీల గంజాయితో నలుగురు నిందితులను చేసి వారి వద్ద నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మంనకు చెందిన పెంబుల ప్రశాంత్, మదిగొండ్ల మణి సందీపులు 20కేజీల గంజాయి అక్రమంగా తరలిస్తుండగా మోతుగూడెం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని నెమలపాలెం నుంచి భద్రాచలంనకు 60కేజీల గంజాయిని నెమలపాలెంనకు చెందిన నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టువద్ద ఇద్దరు వ్యక్తులు ఒక బైక్ పట్టుకున్నారు. మరో ఇద్దరు బైక్‌పై పరారయ్యారు. ఈకేసులో వరుడు బంగారయ్యతో పాటు ఇంకొక వ్యక్తిని అరెస్ట్ చేశారు. రెండు కేసుల్లో రూ.4లక్షల విలువైన 80 కేజీల గంజాయిని పట్టుకున్నారు. చింతూరు సీఐ గజేంద్రకుమార్ మాట్లాడు తూ చింతూరు సర్కిల్ పరిధిలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణా పోలీసులు కో-ఆర్డినేషన్ చేసుకుంటూ గంజాయి నిర్మూలన చేపడతామని తెలిపారు. తప్పించుకున్న వారిని కూడా పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, మిగతా వారిని రాష్ట్ర పోలీసులను సంప్రదించి పట్టుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలో మోతుగూడెం ఎస్ఐ జిగోపాలరావు, ఏఎస్ఐ సూర్యనారాయణరాజు, రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ రాజు, శ్రీను, మురళి, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.


పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

## ఏజెన్సీ సమాచారం



ఢిల్లీలో జరిగే వేడుకలకు ఏజెన్సీ నుంచి ఎంపికైన గిరిజనులు

### ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకలకు గిరిజనులు

రంపచోడవరం, ఆగస్టు 13: ఈనెల 15న ఢిల్లీలో నిర్వహించే 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఏజెన్సీ నుంచి నలుగురు గిరిజన పెద్దలకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వై.రామవరం మండలానికి చెందిన శరంకోట అబ్బాయిరెడ్డి, గున్నమ్మ, గంగవరం మండలానికి చెందిన పాము అర్జున, సూర్యకాంతంను ఎంపిక చేశారు. వారు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయం, కట్టుబాట్లు, ఆహార పద్ధతులు, వ్యవసాయం తదితర అంశాలపై స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివరించనున్నారు. వీరిని ఆదివాసీ సంక్షేమ, సాంస్కృతిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కత్తుల ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కురసం ఫకీర్‌దొర హర్షం తెలిపారు.

### 'ఎన్నికల హామీలు అమలు చేయాలి'

రంపచోడవరం, ఆగస్టు 13: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు పి.టాన్యా అన్నారు. మంగళవారం స్థానిక మార్క్స్-ఏంజెల్స్ భవనంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కుంజా దూలయ్య అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టాన్యా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం పేద ప్రజలపై అనుసరిస్తున్న విధానాలను ఖండించాలని, అన్నిరకాల కులాలు, మతాల వారికి సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. వయనాడ్‌లో కొండ చరియలు పడి మృతి చెందిన కుటుంబాలకు 20లక్షలు నష్టపరిహారం అందజేయాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థుల సీట్లను పెంచాలన్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూములకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో వి.చిట్టిబాబు, బాలుదొర పాల్గొన్నారు.

### సమగ్ర ప్రణాళికతో పంచాయతీల అభివృద్ధి

మారేడుమిల్లి, ఆగస్టు 13: సమగ్ర ప్రణాళికలతో పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ సార్ల లలితాకుమారి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వీరకిషోర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లకు రిఫ్రెషర్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి, పరిపాలనా అంశాలపై చర్చించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పి.విజయకుమార్, సిబ్బంది ఎంవోటీలుగా వ్యవహరించారు. ఎస్ఐఆర్డీ కన్సల్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, డీఎల్‌డీవో కోటేశ్వరరావు, పరిపాలనాధికారిణి పి.జయంతి, ఏబీపీ మనస్విని, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ

రంపచోడవరం, ఆగ స్టు13: ఏజెన్సీ నలుమూలల గ్రామాల ప్రజల నుంచి ఎమ్మెల్యే శిరీషదేవికి వినతులు వెల్లువెత్తాయి. మంగళవారం ఆమె క్యాంపు కార్యాలయంలో తెలుగు యు వత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి అర్జీని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. విద్యుత్ సదుపాయం, రోడ్లు ఏర్పాటు చేయాలని, నూతల పింఛన్ల మంజూరు చేయాలని కోరుతూ అధికంగా అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మర్రిచెట్ల వెంకటేశ్వరరావు, బదిరెడ్డి మోహన్‌రావు, అబ్బులు, మాజీ సర్పంచ్ కుంజం శివ తదితరులు పాల్గొన్నారు.

### శాశ్వత ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించాలి

దేవీపట్నం, ఆగస్టు 13: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర, కొండదొరల సంఘం జిల్లా నాయకుడు యలగాడ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలో 44 గ్రామాల ప్రజలు పోలవరం ప్రాజెక్టు కారణంగా సర్వం కోల్పోయారన్నారు. ప్రజలకు నేటికీ సరైన పునరావాసం కల్పించలేదన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, జూనియర్ కాలేజీ, పోలీస్‌స్టేషన్ తదితర శాశ్వత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు.యుద్ధప్రాతిపదికన నిర్మించాలని కోరారు.

### గంజాయి నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలి

వరరామచంద్రాపురం, ఆగస్టు 13: గ్రామాల్లో యువత మత్తు మాదక ద్రవ్యాలకు బానిసై తమ జీవితాలను ఆదిలోనే పాడుచేసుకుంటున్నారని అటువంటి గంజాయి మహమ్మారిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని వీఆర్‌పురం ఎస్.ఐ సత్యనారాయణ అన్నారు మంగళవారం రేఖపల్లిలో ఆటో డ్రైవర్లతో అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మ్యాజిక్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

### అధికారుల తీరుతో మధ్యాహ్న భోజనానికి దూరమైన విద్యార్థులు

● చేతులెత్తేసిన అధికారులు

రాజవొమ్మంగి ఆగస్టు 13: గత ప్రభుత్వంలో రాజవొమ్మంగి మండలంలోని మంగంపాడు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పటి అధికారులు ఆ పాఠశాలకు పూర్తిస్థాయిలో ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంతో నేటికీ ఆ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందట్లేదు. దీంతో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రత్నాలపేట పాఠశాలకు విద్యార్థులు నడిచివెళ్లి భోజనం చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా, మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎన్నిసార్లు గొంతు చించుకున్న అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారంటూ సర్పంచ్ టి.ఆదిరాజు తెలిపారు. దీనిపై సోమవారం రాజవొమ్మంగి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మండల విద్యాశాఖాధికారి సూరయ్యరెడ్డి మాట్లాడుతూ ఆ పాఠశాలకు యూడైస్(యూడీఐఎస్ఈ) కోడ్ లేదని , మండలంలో ఆరు పాఠశాలలకు యూడైస్ కోడ్ లేదని ఉన్నతాధికారులకు నివేదిస్తే ఐదు పాఠశాలలకు మంజూరు చేశారని, మంగంపాడు పాఠశాలకు ప్రొసీడింగ్స్ లేక యూడైస్ కోడ్ వచ్చేందుకు అవకాశంలేదని చేతులెత్తేశారు. దీనిపై సర్పంచ్ ఆదిరాజు మాట్లాడుతూ ఇన్నిరోజులు ఏమి చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్ని సార్లు తమ సమస్య చెప్పుకున్నా ఇప్పటివరకు మౌనం వహించి, ఇప్పుడు ఇలా చెప్పడం సరికాదన్నారు. విద్యార్థులు పూరిగుడిసేలోనే విద్యాభ్యాసం చేస్తూ మధ్యాహ్న భోజన పథకం అమలుకాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించు కునే నాథుడే కరువయ్యాడని సర్పంచ్ ఆవేదన చెందారు.

### బస్సు ఆగక ప్రయాణికుల ఇక్కట్లు

రాజవొమ్మంగి ఆగస్టు 13: ఏజెన్సీలో నిత్యం ఆర్టీసీ బస్సు లు ఆగిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడడం సదా మామూలే.. అయితే మంగళవారం బస్సు ఆగక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నర్సీపట్నం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ఆర్టీసీ బస్సు మధ్యాహ్నం మూడు గంటలకు రాజవొమ్మంగి మీదుగా వెళ్లాల్సి ఉంది. ఆ బస్సు కోసం పదులసంఖ్యలో ప్రజలు మండుటెండలో వేచి చూశారు. సమయానికి ఆ బస్సు వచ్చినా మండలంలో ఎక్కడా ఆగకుండా వెళ్లిపోతుంది. ఆఖరికి మండల కేంద్రం రాజవొమ్మంగిలో సైతం బస్సు ఆగలేదు. దీంతో ప్రయాణికులు సమీపంలో ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మండల శివారు జడ్డంగి పోలీసుస్టేషన్ వద్ద బస్సును ఆపి కారణం అడగ్గా... డ్రైవర్ మాట్లాడుతూ ఈ రూటు కొత్త సార్ అంటూ సింపుల్‌గా సమాధానం చెప్పాడు.

### ప్రతిగ్రామంలో రెవెన్యూ సదస్సులు

వరరామచంద్రాపురం, ఆగస్టు 13: జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహశీల్దార్ సుబ్బారావు తెలిపారు. ఈనెల 16 నుంచి సెప్టెంబరు 30వ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా భూసమస్యలు, భూఆక్రమణ సమస్యలపై దరఖాస్తులు తీసుకుంటామన్నారు.

### మోతుగూడెం పురవీధుల్లో త్రివర్ణ పతాకం ఊరేగింపు

మోతుగూడెం, ఆగస్టు 13: స్థానిక ఏపీ జెన్కో డీఏవీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆదేశాల మేరకు పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మోతుగూడెం పురవీధుల్లో 50 అడుగుల త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించారు.

### నేడు ప్రజాప్రతినిధులకు సత్కార సభ

కడియం ,ఆగస్టు 13: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులకు బుధవారం సాయంత్రం జీఎంఆర్ కన్వెన్షన్‌లో ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నామని ఆహ్వాన కమిటీ నాయకులు తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిలను కడియం మండలం కూటమి నాయకుల ఆధ్వర్యంలో సత్కరిస్తామన్నారు. తొలుత కూటమి నాయకులు కార్యకర్తలు మండలంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తారని చెప్పారు.

## గ్రామీణ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

» సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్.. కేవీకేలో ముగిసిన నైపుణ్య శిక్షణ




శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

రాజానగరం, ఆగస్టు 13 : కేవీకే అందిస్తున్న నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను గ్రామీణ యువత, రైతులు మహిళలు సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాజమహేంద్రవరం సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషమాధవ్ ఆకాంక్షించారు. మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో నర్సరీ యాజమాన్యం-ఉద్యాన పంటలలో అంటుకట్టు పద్ధతులపై ఆత్మ సౌజన్యంతో గ్రామీణ యువతకు వారం రోజులుగా జరుగుతున్న నైపుణ్య శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు, మహిళలు, నర్సరీలను ఏర్పాటు చేసుకునే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉద్యాన పంటల విభాగంతో పాటు వెటర్నరీ, ఫిషరీస్, గృహ విజ్ఞానం, సస్య రక్షణ తదితర అంశాలపై రైతులకు, రైతు మహిళలకు నైపుణ్య శిక్షణలను ఆత్మ సహకారంతో నిర్వహిస్తామన్నారు. నర్సరీ పెంపకంలో మెలకులు, ప్రోట్రేలలో కూరగాయల నారు పెంపకం, వివిధ జీవ శిలీంధ్ర నాశినిలతో విత్తనం, నారును శుద్ధి చేయడం, షర్డ్ నెట్ పాలీహౌస్‌లలో ఏడాది పొడవునా కూరగాయలు, పూల రకాల నారు పెంపకం, మామిడి, జీడి మామిడిలో అంటు కట్టే పద్ధతులపై శిక్షణ, ప్రదర్శన కల్పించారు. ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి మాట్లాడుతూ ఉద్యాన పంటల విభాగం అధికారి జేవీఆర్ సత్యవాణి పర్యవేక్షణలో ఉత్తమమైన శిక్షణను అందించడంలో ఎంతో కృషి చేశారన్నారు. ఈ శిక్షణలో కోర్సు డైరెక్టర్‌గా కేవీకే ఉద్యాన పంటల అధికారి జేవీఆర్ సత్యవాణి వ్యవహరించారు. శిక్షణ పొందిన యువతకు శేషమాధవ్ సర్టిఫికెట్లు, మొక్కల ప్రూనింగ్‌కు ఉపయోగపడే పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో రాజానగరం, నరేంద్రపురం, కడియం, గొల్లప్రోలు మండలాల నుంచి 15 మంది ఔత్సాహికులు గ్రామీణ ఫౌండేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ సత్రుపా, కామానంద్ మిశ్రా, శాంతి వర్ధన, వీరబాబు, రఘువీర్, సుచరిత, కేవీకే సిబ్బంది ఎన్‌వి రఘునందన్, బి.నాగేశ్వరరెడ్డి, రవీంద్ర, సంజయ్ హెగ్డే, విజయవర్ధన్ పాల్గొన్నారు.

## జాతీయ జెండా ప్రతిష్టను ప్రతిఒక్కరూ కాపాడాలి

» ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి..పలుచోట్ల హర్ ఘర్ తిరంగా



రంగంపేటలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, ఆగస్టు 13: జాతీయ జెండా ప్రతిష్టను ప్రతి ఒక్కరూ కాపాడాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రంగంపేటలో ఎంపీడీవో పి.వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీకి ఆయన ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముందుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏడీబీ రోడ్‌పై మానవహారం నిర్వహించి అందరితో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అందరూ కాన్వాస్‌పై సంతకాలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకొని దేశ ప్రతిష్టను కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, నీలపాల త్రిమూర్తులు, వెలుగుబంటి సత్తిబాబు, ఉండవిల్లి గిరిబాబు, మైలవరపు సాయిరాం, గుండుబిల్లి ప్రసాద్, గారపాటి రాంబాబు, ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.హేమ, హెచ్ఎం వి.పార్థసారధి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి, ఏపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**బిక్కవోలు:** పందలపాక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చెర్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ పతాకాలతో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో పీడీ డి.యువరాజారెడ్డి సర్పంచ్ సబ్బారపు పద్మావతి, ఎస్ఎంసీ చైర్మన్ పంపన వీరసత్యనారాయణ, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

**కోరుకొండ:** శ్రీరంగపట్నంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఏపీఆర్ చౌదరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక చెరువుగట్టు రామాలయం నుంచి మోదకొండమ్మ గుడి మీదుగా గ్రామ ముఖ ద్వారం వద్దకు చేరింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దాల పెదఅమ్మాజీ, మద్దాల రమణ, నీలపాల వెంకన్న, పచ్చారి నరసింహమూర్తి, తగరంపూడి గణపతి, పెనకటి రాంబాబు, బొడ్డేటి సత్యనారాయణ, పి.వీరబాబు, తన్నీరు తాతాజీ పాల్గొన్నారు.

## టీడీఆర్ బాండ్లలో జగన్ ప్రభుత్వం భారీ స్కాం

» ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 13: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.700 కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో మాజీ సీఎం జగన్మోహనరెడ్డి అసలు సూత్రధారి అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. రాజమహేంద్రవరం జీజీహెచ్ ఆవరణలో మంగళవారం ఆయన మాట్లాడారు. సీఐడీ విచారణలో అధికారులతో సహా ఈ స్కాంలో బాధ్యులైన వారందరికీ శిక్ష తప్పదన్నారు. టీడీఆర్ స్కాంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కీలకపాత్ర పోషించినా తెరవెనుక అసలు కథ నడిపింది జగన్ అనేది స్పష్టమవుతున్నదన్నారు. అగ్రిగోల్డు ఆస్తులను స్వాహా చేసిన కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు రాజీవ్ ఏ2గా ఉన్నారన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను రాజీనామా చేయించి ఇంటికి పంపాలని సూచించారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను రాష్ట్రంలోనే నెంబర్ 1 ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని, త్వరలోనే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వేస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, ఎం.రవియాదవ్ పాల్గొన్నారు.

**ఏఈవోల సమస్యలు పరిష్కరిస్తాం**

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 13: రాజమహేంద్రవరంలో రాష్ట్ర వ్యవసాయ విస్తర్ణాధికారుల బృందం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును కలిసి వినతిపత్రం అందించారు. పదోన్నతులు రాక అదేపోస్టులో పదవీ విరమణ చేస్తున్నామని, విస్తర్ణాధికారులు ఏజీబీఎస్సీ చదుకునే అవకాశానికి కొన్ని సంఘాలు అడ్డుపడుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన స్పందించి మంత్రి అచ్చెన్నాయుడుకు ఫోను చేసి సమస్యను వివరించగా సానుకూలంగా స్పందించారని సమస్యకు పరిష్కారం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవరావు, పీటర్ ప్రభుదర్శన్, ఎం.నాగేశ్వరావు, ఏఈవోలు పీవీశ్రీనివాస్, నానిబాబు, సంధ్య ,బద్రి, గణేష్, కవిత పాల్గొన్నారు.

### క్రికెట్ స్టేడియం పనులకు చర్యలు

పరిశీలనలో కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 13 : రాజమహేంద్రవరం నాగుల చెరువు మార్కెట్ వద్దగల పోతుల వీరభద్రరావు మునిసిపల్ స్టేడియం గ్రౌండ్‌లో తలపెట్టిన క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులకు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శాప్ స్టేడియంను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. స్టేడియం గ్రౌండ్ ఫ్లోరులో అదనంగా టాయిలెట్స్ ,అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, దుస్తులు మార్చుకునే గదులు నిర్మించాలన్నారు. ద్విచక్ర వాహనాల నిలుపుదలకు పడమర వైపున గేటు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని పనులకు తగిన అంచనాలు పూర్తి చేసి టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ జి.పాండురంగారావు, ఈఈ మదర్షా అలీ, డీఈఈ ప్రసాద్, ఏఈ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### పెట్రోల్ పోసి నిప్పంటించుకున్న వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అప్పు ఇచ్చిన ఆసామి ఒత్తిడికి పరువు పోయిందని ప్రాణాలు తీసుకోవాలని తెగించి త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్న నాగ వరప్రసాద్ ప్రాణాలతో పోరాడి ఓడిపోయాడు. స్థానిక లింగంపేటకు చెందిన నాగ వరప్రసాద్(45) ఈ నెల 10న ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. అయితే ఆయనకు మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడని సీఐ అప్పారావు తెలిపారు. బాకీ వసూలు కోసం వేధించిన నాగళ్ల సూరి బాబు యాదవ్‌ని ఇప్పటికే అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

### వివాహిత ఆత్మహత్య

రాజమహేంద్రవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): లాలాచెరువుకు చెందిన వివాహిత మృతిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్టణానికి చెందిన లావణ్య(20)కు స్థానిక స్పిన్నింగ్ మిల్లు కాలనీకి చెందిన టి.సాయితో ఏడాది కిందట వివాహమైంది. అయితే కొద్ది రోజులుగా పొరుగింటి వాళ్లతో గొడవలు జరుగుతున్నాయని ఎస్ఐ తెలిపారు. రెండు రోజుల కిందట జరిగిన గొడవతో మనస్తాపం చెందిన లావణ్య మంగళవారం రాత్రి తన గదిలో సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకుందని ప్రాథమికంగా అంచనాకు వచ్చామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): లింగంపేట ఐదో వీధి అంజనేయస్వామి విగ్రహం సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉందని వీఆర్వో ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని త్రీటౌన్ సీఐ అప్పారావు పేర్కొన్నారు. మృతుడికి సుమారు 50ఏళ్లు ఉంటాయని, ఎడమ మోచేతిపై బి.రామారావు అని పచ్చబొట్టు ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని సీఐ కోరారు.

### మురికి గుంటలో శవం

రాజమహేంద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మురికిగుంటలో మృతదేహం లభ్యం కావడంపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. సీఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. మెడికల్ కళాశాల నిర్మాణంలో పనిచేస్తున్న కూలీలు స్నానం చేయడానికి ఏర్పాటు చేసిన నీటి కుండీ పక్కన ఉన్న మురికి గుంటలో ఒక మృతదేహం ఉండగా.. బయటకు తీయించి ఆచూకీ కోసం ప్రయత్నించారు. ఫలితంలేకపోవడంతో ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమరేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని సీఐ కోరారు.

### రేపటి నుంచి ఆర్ఎస్ఎస్ జనజాగరణ

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం, రక్షాబంధన్ సందర్భంగా ఈ నెల 15 నుంచి పంచ పరివర్తన్ పేరిట జనజాగరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ చాలక్ డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. పంచవర్తన్‌లో భాగంగా ఇంటింటికీ వెళ్లి కార్యకర్తలు చైతన్యం కలిగిస్తారన్నారు. ఓలేటి సత్యనారాయణ, రిమ్మలపూడి సుబ్బరాజు, వాడ్రేవు మాణిక్యాలరావు,మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

### హిందువులపై దాడికి నిరసన ర్యాలీ

కడియం, ఆగస్టు 13 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరశిస్తూ కడియంలో హిందూ ధర్మ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ చేశారు. కడియం తహశీల్దార్ కె.పోసిబాబు, ఎస్ఐ బి దుర్గాప్రసాద్ లకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో అనంతేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ, డాక్టర్ గుర్రాల వెంకట్రావు, డాక్టర్ దేవరపు నీలకంఠరావు, ఆకుల శ్రీధర్, బొరుసు సుబ్రహ్మణ్యం, దొడ్డ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### మానవ అక్రమ రవాణా నిరోధించాలి

అనపర్తి, ఆగస్టు 13: మానవ అక్రమ రవాణా నిరోధించడంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని హైదరాబాద్‌లోని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ అన్నారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మానవ అక్రమ రవాణా నిరోధంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన అవగాహనా సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఉద్యోగం, సినిమా అవకాశాల కోసం అనేక మంది మహిళలు మోసపోతున్నారన్నారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికి 28,200మంది మహిళలు, యువతులను కాపాడామని అన్నారు. సీడీపీవో జెస్సీప్లోరెన్స్ మాట్లాడుతూ యువతులు సామాజిక మాధ్యమాల ద్వారా మోసాలకు గురవుతున్నారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు లఘు చిత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్లు శివ, సుప్రియ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఛాయాదేవి, అంజలి, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇంటింటా దంత సమస్యల గుర్తింపు

అనపర్తి, ఆగస్టు 13: రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన ఇంటింటా దంత సమస్యల గుర్తింపు కార్యక్రమాన్ని జీఎస్ఎల్ దంత కళాశాల వైద్యులు నిర్వహిస్తున్నారు. మండలంలోని 11 గ్రామాల్లోను ఇంటింటికీ వెళ్లి దంత సమస్యలను గుర్తించేందుకు 40మంది వైద్యులు నాలుగు రోజులుగా పర్యటిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి అనపర్తి పూర్తిగాను సర్వే నిర్వహించగా దుప్పలపూడి, పీరా రామచంద్రపురం గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. ఇప్పటివరకు సుమారు 7వేల మంది వరకు చిన్నాపెద్ద సమస్యలు ఉన్నట్టు గుర్తించామని వైద్యులు తెలిపారు. త్వరలో నిర్వహించే మెగా దంత వైద్య శిబిరంలో వీరందరికి ఉచిత వైద్య సేవలు అందించనున్నారు.

### ఈ- పంట నమోదు చేసుకోవాలి

**రంగంపేట వ్యవసాయాధికారి శ్రీనివాసరావు**

రంగంపేట, ఆగస్టు 13: మండలంలో ఖరీఫ్ -2024లో సీజన్‌కు సంబంధించి వేసిన పంటను ప్రతి సొంతరైతు, కౌలురైతులు ఈ- పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థాని విలేకర్లతో మాట్లాడారు. ఈ-పంట నమోదు చేయించుకోకుంటే ధాన్యం కొనుగోలులో, పంట నష్టం, పంటల బీమా వంటివి, రైతుసేవా కేంద్రాల ద్వారా వచ్చే ప్రభుత్వ పథకాలకు అర్హత కోల్పోతారన్నారు. ప్రతీ రైతు తమ పంటను ఈ-పంట బుకింగ్ చేయించుకోవాలని చెప్పారు. దీనికి సంబంధించి ఆధార్‌కార్డు జిరాక్స్‌పొలం పాస్‌బుక్ జిరాక్స్, బ్యాంక్ అక్కౌంట్‌బుక్ జిరాక్స్, కౌలు రైతు అయితే కౌలుకార్డు జిరాక్స్ తీసుకొని తమ గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

### బాల్యవివాహాలు చేస్తే కఠినచర్యలు

దివాన్‌చెరువు, ఆగస్టు 13: బాల్యవివాహాలు చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీవో టి.నాగమణి అన్నారు. సంపత్‌నగరంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలపై సర్పంచ్ పి.రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ బాల్య వివాహ చట్టం-2006, సంబంధిత జీవోలు, బాలల సంరక్షణ చట్టాలను వివరించారు. బాల్య వివాహ నిరోధక అధికారులుగా జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ ఉండే అధికారుల వివరాలు, వారి విధులను చెప్పారు. అలాగే బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమ ప్రాధాన్యతను తెలిపారు. కార్యక్రమంలో డీసీపీయూ కార్యాలయం కౌన్సిలర్ సీహెచ్ అభిషాలోము, ఉపసర్పంచ్ ఎన్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఫ్రీడమ్ ఫైటర్స్‌పార్క్ సందర్శన

దివాన్‌చెరువు, ఆగస్టు 13: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కోటిపల్లి బస్‌స్టాండ్ వద్ద గల ఫ్రీడమ్ ఫైటర్స్ పార్క్‌ను వర్శిటీ విశ్వవిద్యాలయ విద్యార్థులతో బాటు ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. ఆయనకు ఆంధ్రకేసరి యువజన సమితి నాయకులు జమ్మిరావు, దేశిరెడ్డి బలరాంనాయుడు, మాదిరాజు శ్రీనివాస్ స్వాగతం పలికారు. స్వాతంత్ర్య సంగ్రామంలో రాజమహేంద్రవరం ప్రాంతం నుంచి పోరాటం చేసిన వీరమహిళల విగ్రహాలను వారి పోరాట ప్రతిభను, వారు అనుభవించిన జైలు జీవిత గాథలను జమ్మిరామారావు వీసీకి వివరించారు. ఈ సందర్భంగా పార్క్‌లోని గాంధీజీ విగ్రహానికి వీసీ పూలమాలలు వేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, మహనీయులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సూచించారు. అనంతరం జమ్మిరామారావు ప్రచురించిన వివిధ పుస్తకాలను విశ్వవిద్యాలయానికి బహూకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు ఎం.గోపాలకృష్ణ, రాజశేఖర్, అప్పలరాజు, శిరీష, సుజాత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

### ధవళేశ్వరంలో ఉచిత వైద్య శిబిరం


ధవళేశ్వరం, ఆగస్టు13: ఏపీ ఎన్జీవో ధవళేశ్వరం యూనిట్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం ఉదయం అసోసియేషన్ భవనంలో నేత్ర, దంత, డయాబెటిక్, గుండె సంబంధిత వైద్యులు పాల్గొని వైద్యపరీక్షలు, రక్తపరీక్షలు, యూసీజీ, టుడీ, ఏకో వంటి పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. శిబిరం నిర్వాహకుడు సతీష్ ధవళేశ్వరం యూనిట్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.జై కుమార్, బి.లక్ష్మణుడు, కేఎస్ గౌరీశంకర్, ఎస్.సత్తిరాజు, పీఎస్ శేషుకుమార్,వాసుదేవి పాల్గొన్నారు.

### క్యాన్సర్‌పై అవగాహన అవసరం

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 13: క్యాన్సర్ వ్యాధి పట్ల అందరికీ అవ గాహన అవసరమని జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యనిపుణుడు డాక్టర్ కె.రామ్ గోపాల్, పీఎంపీ అసోసియేషన్ జిల్లా సలహాదారు ఎమ్మీఆర్ మూర్తి అన్నారు. కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ, ఆదిత్య మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆదిత్య కళాశాల సెమినార్ హాల్లో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. నేటి అదుపుతప్పిన ఆహార నియమాలు, మద్యపానం, ధూమపానం, ముఖ్యంగా ప్లాస్టిక్‌ను వాడడం విడనాడాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధి తొలి దశలో గుర్తించగలిగితే చికిత్స సులువని అన్నారు. డాక్టర్ మాణిక్యాంబ మాట్లాడుతూ మహిళలకు వచ్చే రొమ్ము, గర్భాశయ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, తోరాటి ప్రభాకరరావు, కళాశాల ప్రిన్సిపాల్ రహమాన్, వీటీటీ.రాజు, పి.దేవానందం, పి.చిన్ని, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోండి

కోరుకొండ, ఆగస్టు 13: నియోజకవర్గంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో రైతులు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విద్యుత్‌శాఖ డైరెక్టర్ పృథ్వీరాజ్‌కు విజ్ఞప్తి చేవారు. ఈ మేరకు ఆయన మంగళవారం విశాఖపట్నంలో ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్‌డైరెక్టర్ పృథ్వీరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో లోఓల్టేజ్ సమస్య, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. అలాగే 3 మండలాల్లో చేపట్టాల్సిన విద్యుత్ సరఫరాకు సంబంధించిన వివిధ పెండింగ్ పనులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించడానికి ఆర్‌డీఎస్ఎస్ కింద వరుసగా 33/11కేవీ సబ్‌స్టేషన్లను రాజానగరం మండలంలో ముక్కినాడ వద్ద ఒకటి, నన్నయ యూనివర్సిటీలో మరొకటి ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో 104 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే బలరామకృష్ణ విజ్ఞప్తిచేశారు.







# మారని..ప్లాన్!

## ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తే.. అమరావతి నుంచే అనుమతులు

- ప్రభుత్వం మారినా..మారని తీరు
- గత వైసీపీలో అక్కడి నుంచే అన్నీ
- రుడా సమాచారం ఉండదు
- టౌన్ ప్లానింగ్‌కు తెలియదు
- అక్రమార్కులకు అధికారుల అండ
- ఎటు చూసినా అక్రమ నిర్మాణాలే
- నేటికీ నగరంలో సాగుతున్న దందా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- కూటమి మార్చాలని డిమాండ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 13 : అధికారులు కళ్లుండీ చూడలేకపోతున్నారు.. చెవులుండీ వినలేకపోతున్నారు.. అధికారం ఉండీ అరికట్టలేకపోతున్నారు.. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతుంది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పక్కదారి పట్టి కొంతమంది అక్రమార్కుల జేబుల్లోకి పోతుంది. నిబంధనలకు విరుద్ధంగా కట్టిన వాటిని క్రమబద్ధీకరించి ఫైన్ వేయడం ద్వారా ప్రభుత్వానికి కొంత ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే ఉన్న తప్పులను అక్రమాలను దాచిపెట్టే కొంత మంది అధికారులు... మామూళ్ల మత్తులో అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారు. దీంతో నగరంలో ఎటు చూసినా అక్రమ నిర్మాణాలే కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లలో ఈ తరహా నిర్మాణాలు కోకొల్లలు.. ఎందుకంటే ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తే అమరావతి నుంచి అనుమతులొస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఏం జరిగిందో నేటికీ అదే జరుగుతోంది. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరంలో నగర పాలక సంస్థ ఆదీనంలోని పట్టణ ప్రణాళిక విభాగానికి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (రుడా)కి మధ్య సమన్వయలోపం అక్రమార్కులకు వరంగా మారింది.

### రుడా వర్సెస్ టౌన్ ప్లానింగ్

రాజమహేంద్రవరంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలకు వాటి కొలతల ఆధారంగా ఆన్‌లైన్‌లో ప్లాన్ అప్రూవల్స్‌ను రుడా జారీ చేస్తుంది. దీనికి సంబంధించిన సమాచారం అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. అయితే భవనాల అంతస్తులకు సంబంధించిన ప్లాన్ అప్రూవల్స్ నిర్మాణ ప్లింత్ ఏరియా, సెట్‌బాక్స్ సమా చారం వంటివి టౌన్ ప్లానింగ్ వద్దలేవు.దీంతో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు టచ్ చేయలేని పరిస్థితులు ఉన్నాయి. రెండు శాఖల మధ్య సమన్వయ లోపాన్ని ఆసరాగా చేసుకుని కొంత మంది అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.దీని వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలున్నాయి. గతంలో మాజీ ఎంపీ భరత్‌రామ్ పేరు చెప్పి ఒక ముఠా నగరంలో అక్రమ భవన నిర్మాణాలు విచ్చలవిడిగా చేసింది.ప్లాన్లు లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేసుకోమని వారి నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలుచేసిన ఘటనలు ఉన్నాయి. ఆయా నిర్మాణాలు వెలుగులోకి వచ్చిన వెంటనే యాక్షన్ తీసుకోకుండా భవన యాజమానులు కోర్టు వెళ్లి స్టే తెచ్చుకునే వరకు అధికారులు ఆగి సహకరించిన ఘటనలు ఉన్నాయి.

### అంతా పైవాడి దయ..

వ్యవస్థలో ఉన్న లోపాలను వినియోగించుకుని కొంత మంది వక్రమార్గంలో వెళుతున్నారు. వాస్తవానికి రుడా ప్లాన్ అప్రూవల్‌కు వెయ్యి చదరపు గజాల స్థలం నుంచి ఆరంభిస్తారు. వెయ్యిలోపు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు జారీ చేయాలి. కానీ గత ఐదేళ్లలో ఈ పద్ధతికి గత ప్రభుత్వం తూట్లు పొడిచింది. టీడీఆర్ బాండ్ (ట్రాన్స్‌ఫర్‌బుల్ డవలప్‌మెంట్ రైట్స్) కింది 200 చదరపు గజాల స్థలంలో భవనం నిర్మించుకునేందుకు రుడాకు ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకునే వెసులుబాటు రాజమహేంద్రవరంలో ఉంది.ఈ టీడీఆర్ బాండ్లు రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో ఉన్నవారెవరైనా కొనుగోలు చేసుకుని దానిని వారు నిర్మించుకునే భవన నిర్మాణ అప్రూవల్ దరఖాస్తుకు జతచేసి రుడాకి ఆన్‌లైన్‌లో పెట్టుకునే పరిస్థితి ఉంది. ఇలా దరఖాస్తులు సమర్పించిన సమాచారం టౌన్ ప్లానింగ్ అధికారుల వద్ద ఉండడం లేదు. వాస్తవానికి 2019కి పూర్వం ఈ పరిస్థితి లేదు. రుడా ఏర్ప డిన తరువాత గత ప్రభుత్వం విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలకు లేని రూల్ రాజమహేంద్రవరంతో పాటు కొన్ని కార్పొరేషన్లకు పెట్టడం వెనుక పెద్ద ప్లాన్ దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రుడా ప్లాన్ వెయ్యి గజాల లోపునకు ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తే దానిని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఫీల్డ్ తనిఖీలకు వెళ్లి ప్రాథమిక ఆమోదం తెలిపాకే ఆయా ప్లాన్లు అప్రూ వల్ అయ్యేవి. కానీ గత ప్రభుత్వం దీనికి విరుద్ధంగా రాజమహేంద్రవరంతో పాటు కొన్ని మునిసిపాలిటీలకు సంబంధంలేకుండా ఆన్‌లైన్‌లో నేరుగా పైనుంచి అప్రూవల్ అయ్యే విధానం ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఇదే కొనసాగుతుంది. దీని వల్ల టౌన్ ప్లానింగ్ అధికారుల వద్ద నగరంలో రుడాకు దరఖాస్తు చేసుకుని నిర్మాణంలో ఉన్న ఏ భవనానికి సంబంధించిన సమాచారం లేదు.



### విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు

రాజమహేంద్రవరం అడ్డాగా విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు కడుతున్నారు. ప్లాన్ అప్రూవల్స్ ఉంటున్నాయి. కానీ వాటికి విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. నగరంలో సెల్లార్లు లేకుండా అనేక బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. వాటిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలులేవు. గతంలో నగరపాలక సంస్థ కమిషనర్‌గా విజయరామరాజు పనిచేసినప్పుడు ఆయన చాలా డైనమిక్‌గా సెల్లార్లు లేని భవనాలకు నోటీసులు జారీచేశారు. కొన్నింటికి గ్రౌండ్ ఫ్లోర్‌లు ఖాళీ చేయించి సెల్లార్లుగా మార్చిన సందర్భాలు ఉన్నాయి. ఎందుకంటే పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలకు సెల్లార్లు లేకపోతే పార్కింగ్‌లేక వాటి ఎదుట వాహనాలతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పవు. ఇప్పుడు నగరంలో జేఎన్‌రోడ్డు, తిలక్ రోడ్డు, మెయిన్‌రోడ్డు, దానవాయిపేట, ప్రకాశ్‌నగర్ తదితర ప్రాంతాల్లో సెల్లార్లు లేని భవనాలు అనేకం ఉన్నాయి. వాటికి అనుమతులు ఎలా ఇచ్చారో అర్థంకాని పరిస్థితి ఉంది.నగరంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భవన నిర్మాణాలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. వాటిలో జేఎన్ రోడ్డు, తిలక్‌రోడ్డు, సదరన్ స్పైస్ చుట్టుపక్కల నిర్మాణంలో ఉన్న భవనాల్లో చాలా లోపాలు ఉన్నాయి. సెట్‌బాక్స్‌లు,సెల్లార్లు,అనుమతికి మించి శ్లాబ్‌లు వేసేశారు.వాటిని తనిఖీ చేసి చర్యలు తీసుకునే నాథులే లేరు. కొంత మంది అక్రమార్కులు ఇప్పుడు ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి వారిపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు.



రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, విద్యార్థులు... బీజేపీ బైక్ ర్యాలీలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, నల్లమిల్లి

## వినువీధుల ఎగిరింది జెండా...

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 13 : ప్రతి భారతీయుడిలో దేశ భక్తిని పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను జిల్లాలో స్ఫూర్తివంతంగా నిర్వహించుకుంటున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలో వైజంక్షన్ నుంచి మునిసిపల్ కార్యాలయం అంబేడ్కర్ విగ్రహం వరకు మంగళవారం కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ కేతన్‌గార్గ్‌లతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ సమైక్యత సమగ్రతను కాపాడడం మనందరి బాధ్యత అన్నారు. అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్ధేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, టూరిజం ప్రాంతీయ ఉపసంచాలకులు స్వామినాయుడు, డీఈవో కె వాసుదేవరావు, సెంట్రల్ జోన్ డీఎస్పీ కే.రమేష్ బాబు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ అర్బన్ బి.దిలీప్ కుమార్, జిల్లా స్పోర్ట్స్ అధికారి బీవీవీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 13 : బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరంలో జాతీయ జెండాలు చేతపట్టి హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏవీ అప్పారావు రోడ్డులోని రామాలయం సెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండు వరకూ బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులతో కలిసి ర్యాలీ జరిపారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కందికొండ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, జనసేన సిటీ ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో ఎంపీ పురందేశ్వరి పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 13 : రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి బుధవారం కొవ్వూరు, రాజమహేంద్రవరం, కడియం నియోజకవర్గాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి రానున్న పురందేశ్వరి 9 గంటలకు కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం పోచవరం, రాగాలపల్లి గ్రామాల్లో పర్యటిస్తారు. కొవ్వాడ కాలువ ఉధృతికి నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకూ రాజమహేంద్రవరం ఎంపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. అనంతరం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జరిగే భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దుర్గేష్, పలువురు కూటమి ఎమ్మెల్యేలతో కలసి పాల్గొంటారు.సాయంత్రం ఐదు గంటలకు కడియం మండలం వీరవరం జీఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ సత్కారోత్సవంలో పాల్గొంటారని ఎంపీ కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

## 20 నుంచి కొత్త ఓటర్ల నమోదు

రాజమహేంద్రవరం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20 నుంచి అక్టోబరు 18 వరకూ స్పెషల్ సమ్మరి రివిజన్ -2025 చేపట్టాలని, బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి 18-19 ఏళ్ల వయస్సు ఉన్నవారిని ఓటర్లు చేర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వివేక్‌యాదవ్ జిల్లా కలెక్టర్లతో ఎస్ఎస్ఆర్ రూపకల్పన, ఫొటో ఓటరు జాబితా, తదితర అంశాలపై మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. ప్రతి ఏడాది జనవరి, ఏప్రిల్,జూలై,అక్టోబరు ఒకటో తేదీల్లో కొత్తగా 18 ఏళ్ల నిండిన వారి పేర్లను ఓటర్లుగా నమోదు చేస్తున్నామన్నారు. ఈ నెల 20 నుంచే బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ చేపట్టాలన్నారు. కొత్త ఓటరు నమోదు, తొలగింపు,చిరునామా మార్పునకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి శుక్రవారం సమావేశాలు నిర్వహించాలని,అక్టోబరు 19 నుంచి 20 వరకూ సమీకృత నమూనా ఓటరుజాబితా సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఓటర్ల జాబితా అక్టోబరు 29న ప్రచురించి,నవంబరు 28వ తేదీ వరకూ వాటిపై అభ్యంతరాలు స్వీకరించి,డిసెంబరు 24వతేదీ లోపు పరిష్కరించాలన్నారు.కార్యక్రమంలో ఆర్‌వోలు కమిషనర్ కేతన్ గర్గ్, సబ్- కలెక్టర్ అశుతోశ్ శ్రీవాత్సవ,డీఆర్‌వో జి.నరసింహులు,ఎస్‌డీసీకెల్ శివజ్యోతి,ఎస్‌డీసీ ఎం. మాధురి, ఎస్‌డీసీఆర్‌వీ.రమణనాయక్, ఎస్.సరళావందనం పాల్గొన్నారు.

ఇసుక కొరత తీరేదెన్నడో? 8







## చూడండి సారూ.. ఇదీ తీరు!

ప్రభుత్వాసుపత్రికా మేం రాం బాబోయ్.. ఇదీ చాలా మంది మాట.. ఎందుకంటే అక్కడ సరైన సౌకర్యాలుండవ్.. అసలు పట్టించుకోరు.. మన చావు మనం చావాల్సిందే.. ఈ మాటలు ఎప్పుడు అన్నా.. నేటికీ ప్రభుత్వ ఆసుపత్రులు అలాగే ఉన్నాయి.. సోమవారం రాత్రి 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కిన ఈ చిత్రాలే నిదర్శనం.. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోనివి.. ఒకే బెడ్‌పై ఇద్దరు పడుకుని ఉన్న ఈ వార్డు ఏమిటో తెలుసా..ఐసీయూ అయినా ఇంతే.. అదే ప్రైవేటు ఆసుపత్రిలో అయితే ఐసీయూలో ఏ ఒక్కరినీ అడుగుపెట్టనీయరు.. ఇక్కడ మాత్రం ఇలా ఒకే బెడ్‌పై ఇద్దరు.. అయినా ఉన్నతాధికారులకు పట్టదు.. ఆసుపత్రిలో కనీసం వీల్‌ఛైర్ పట్టుకునేందుకు సిబ్బంది కానరావడంలేదు.. రోగుల బంధువుల చేసుకోవాల్సిందే.. ఎక్కడికి కావాలంటే అక్కడికి వీల్‌ఛైర్‌లో తీసుకెళ్లాల్సిందే.. వీల్‌ఛైర్ లేదంటే భుజాలపై మోసుకెళ్లాల్సిందే.. ప్రతి రోజూ ఇటువంటి సిత్రాలు కోకొల్లలు..అయినా పాలకులూ పట్టించుకోరెందుకో మరి..! - (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

## జీడీఏ ఉద్యోగికి షోకాజ్ నోటీసు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 13 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏ)గా పనిచేస్తున్న ఓ ఉద్యోగికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ మంగళవారం షోకాజ్ (సంజాయిషీ) నోటీసు జారీ చేశారు.రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.జీడీఏగా పనిచేస్తున్న డి.గౌతమ్ రాంజీపై సూపర్‌వైజర్ ఆర్‌వీకే భీమేశ్వరరావు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.ఇదిలా ఉంటే కొద్దిరోజుల కిందట సదరు జీడీఏ వ్యవహారశైలిపై పలువురు ఎంఎన్‌వోలు, జీడీఏలు విచారణాధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు చేయడం గమనార్హం. సూపరింటెండెంట్ జోక్యం చేసుకుని సహోద్యోగులు, రోగులతో వ్యవహరించే పద్ధతి మార్చుకోవాలని మందలించి వదిలేసినా అతని తీరు మారకపోవడంతో తాజాగా ఉన్నతాధికారులు సంజాయిషీ నోటీసు జారీచేశారు.దీనిపై జీజీహెచ్ ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది.

అనుమానంతో హత్య 8

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు..
ముగ్గురు మృతి 7

## పుష్కరాలకు ప్రణాళిక రూపొందించండి

### కలెక్టర్ ప్రశాంతి



పుష్కరాలపై చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 13 : రాజమహేంద్రవరంలో 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ఒక ప్రణాళిక రూపొందించి దాని ప్రకారం చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్‌లతో వివిధ అంశాలపై కలెక్టర్ చర్చించారు. పుష్కరాలకు ప్రణాళిక సిద్ధం చేసి వాటి అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేయాలన్నారు. మెయిన్‌రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనే జీ వ్యవస్థ ఏర్పాటుకు చేసిన ప్రతిపాదనలు, కంబాలచెరువు ప్రాంతంలో ముంపు సమస్యకు పరిష్కారం, ప్రధాన రహదారులు వెడల్పు చేయ డం, ట్రాఫిక్ సమస్య అధిగమించడం వంటి పనులు చేపట్టాలన్నారు.ఆయా సమస్యలను అధిగమించడం సాధ్యమవుతుందని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఇప్పటికే తాను విస్తృత స్థాయిలో పర్యటించిన డ్రైనేజీ వ్యవస్థ, రహదారులపై ఒక అవగాహనకు వచ్చినట్టు స్పష్టం చేశారు. ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం, నగరంలో రోడ్ల వెడల్పు చేయడం,ట్రాఫిక్ దారి మళ్లింపుపైన, ప్రత్యామ్నాయ మార్గాలపైనా ఒక కొలిక్కి వచ్చినట్టు చెప్పారు.

## పవర్ వీడర్ వినియోగంతో కలుపు నివారణ


పవర్ వీడర్ వినియోగాన్ని వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

కొవ్వూరు, ఆగస్టు 13: వరి పంటలో పవరు వీడరు తిప్పడం వలన రసాయన, కలుపు మందుల వాడకుండా కలుపు నివారించవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.మాధవరావు అన్నారు. మంగళవారం మండలంలోని కాపవరంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పవర్‌వీడర్‌తో వరి పంటలో కలుపు నివారణపై రైతులకు వివరించారు. నాట్లు వేసిన 15, 30, 45 రోజుల్లో పవర్‌వీడర్ తిప్పడం వల్ల రసాయనాలు వాడకుండా కలుపు నివారించవచ్చునన్నారు. ఎకరానికి 2 నుంచి 3 గంటలు తిప్పడానికి రెండున్నర లీటర్ల పెట్రోలు ఖర్చవుతుందన్నారు. అనంతరం వరిలో సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో డీపీఎం బి.తాతారావు, ఏడీఏ చంద్రశేఖర్, జయ రామలక్ష్మి, ఏవో ఎ.గంగాధర్, ఎంటీ మహారాణి, ఎన్ఎఫ్‌జే సతీష్, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

## మేలైన సాగు పద్ధతులతో అధిక దిగుబడులు

గోపాలపురం, ఆగస్టు 13: మేలైన వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులకు సూచించారు. మండలంలోని చిట్యాల గ్రామంలో వ్యవసాయాధికారి రాజారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. సాగు చేసే రైతులకు ఇండిగ్యాప్ సర్టిఫికెట్ ద్వారా పండించిన ఉత్పత్తులను 129దేశాల్లో విక్రయించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. వరిలో సమగ్ర సస్యరక్షణ పంటల సాగు యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ చంద్రశేఖర్, రైతులు, డీఏఏలు, డీహెచ్ఎలు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టాలి

నల్లజర్ల, ఆగస్టు 13:నల్లజర్లలోని కూచిపూడి గంగరాజు వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ ఎరువులపై పండిస్తున్న వరి పంటను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి పెట్టాలని తద్వారా మన వ్యవసాయ ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతయ్యే అవకాశం ఉంటుందన్నారు. పురుగుమందుల వినియోగ సమయంలో తీసుకోవాలసిన జాగ్రత్తలు వివరించారు. విత్తనశుద్ధి, వేప కషాయం తయారీ, వరి పంటలో దీర్ఘకాలిక ప్రయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ చంద్రశేఖర్, ఏవో కమల్‌రాజ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## అశ్వారావుపేట-హైదరాబాద్ నాన్‌స్టాప్ ఆర్టీసీ సర్వీస్

కొవ్వూరు, ఆగస్టు 13: కొవ్వూరు ఏపీఎస్ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ సర్వీసును ప్రారంభించినట్టు డిపోమేనేజర్ వై.కుమార్ తెలిపారు. 4945 సర్వీస్ నెంబరు బస్సు 18-45 గంటలకు కొవ్వూరు, తాళ్ళపూడి, పోలవరం, దొండపూడి జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట మీదుగా హైదరాబాద్‌కు వెళతుందని, తిరుగు ప్రయాణంలో 4946 సర్వీస్‌గా 18-45 గంటలకు హైదరాబాద్‌నుంచి అశ్వారావుపేట వరకు వెళతుందని చెప్పారు. 4943 సర్వీస్‌గా 19-00 గంటలకు రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు బైపాస్ మీదుగా తాళ్ళపూడి, గజ్జరం, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట నుంచి హైదరాబాద్, 4944 సర్వీస్ 19-20 గంటలకు తిరుగు ప్రయాణంలో బీహెచ్ఈఎల్‌లో బయలుదేరి జంగారెడ్డిగూడెం వరకు నడపనున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు.

## అక్రమకేసులు ఎత్తివేయాలని హోంమంత్రికి వినతి

కొవ్వూరు, ఆగస్టు 13: ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులపై పెట్టిన అక్రమకేసులు ఎత్తివేయాలని హోం మంత్రి వంగలపూడి అనితకు వినతిపత్రం అందించినట్టు డీవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులపై గత ప్రభుత్వాలు అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు ఇంటికి వచ్చిన హోం మంత్రికి వినతిపత్రం అందించామన్నారు. ఈ కేసులతో విద్యార్థులు, యువకులు, ఉద్యోగాలకు, ఉన్నత చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. మంత్రి స్పందిస్తూ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని చెట్టే రాజు తెలిపారు.

## తీపర్రు వంతెన అప్రోచ్ రోడ్డు పనులు


తీపర్రు వంతెన అప్రోచ్ రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

పెరవలి, ఆగస్టు 13: నిడదవోలు-నరసాపురం కాలువపై తీపర్రు వద్ద ఉన్న వంతెనకు అప్రోచ్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెన అప్రోచ్‌రోడ్డు కాలువలోకి జారి పడడంతో పొంచి ఉన్న ప్రమాదం అంటూ ఆంధ్రజ్యోతిలో వార్తలు వచ్చాయి. ఈ విషయం మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ ప్రాంతాన్ని పరిశీలించి స్థానిక అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో మంత్రి చెప్పినా పట్టించుకోరా అంటూ ఆంధ్రజ్యోతిలో మళ్లీ వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మంత్రి మళ్లీ ఈ ప్రాంతాన్ని పరిశీలించి ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఇక్కడ పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. దీంతో స్పందించిన అధికారులు వెంటనే సర్వేపాదులు, వెదురు, తడికలతో మట్టి జారిపోకుండా అడ్డుకట్ట వేసి ఆపై షట్రతో పూడ్చారు. దీంతో గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## పిల్లలకు వైద్య పరీక్షలు

పెరవలి, ఆగస్టు 13: ఖండవల్లి జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పెరవలి పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలు పరిశుభ్రతపై వివరించారు. పిల్లలకు పలు పరీక్షలు చేశారు. 325 మంది విద్యార్థులకు ఎనిమిక్ ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులందరికీ ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేష్, రాణి రత్నకళ, సురేంద్ర, మాధురి, రమ్య కృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

## మానవత సంస్థకు విరాళం

ఉండ్రాజవరం, ఆగస్టు 13: మండలంలోని వేలివెన్ను గ్రామంలో మానవత సంస్థ మండల సమావేశం అధ్యక్షుడు కఠారి సిద్దార్థరాజు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సంస్థకు సంబంధించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సంస్థ శాంతిరథం కొనుగోలుకు వేలివెన్నుకు చెందిన దాతలు బలభద్ర భాస్కరరావుగుప్త, కంబాలమ్మ దంపతులు రూ.10వేలు, తణుకుకు చెందిన తీగల సువర్చల రూ.10 వేలు, దువ్వ గ్రామానికి చెందిన వత్తిమిల్లి ప్రభావతి రూ.10 వేలు విరాళాలను ఈ సమావేశంలో అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నాయకులు తాతిని వెంకటకృష్ణారావు, ఫణితిని పార్వతి, కోడూరి శ్రీనివాసరావు, రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు.

## న్యాయ విజ్ఞానంపై అవగాహన సదస్సు



నిడదవోలు, ఆగస్టు 13: విద్యార్థులు పాఠశాల దశ నుంచే న్యాయ విజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ న్యాయవాది సీహెచ్ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం నిడదవోలులోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. భారత రాజ్యాంగం, ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడుతుందో, న్యాయ విజ్ఞానంపై అవగాహన కలిగించారు.మండలంలోని సమిశ్రగూడెంలో ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏఎస్ విశ్వనాథ్, ఎం.వెంకటేశ్వరరావు, నక్కా వెంకటేశ్వర్లు, ప్రసన్న పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంచాలు అందజేత

ఉండ్రాజవరం, ఆగస్టు 13: మండలంలోని మోర్త నెం.2 పాఠశాల విద్యార్థులకు ఉండ్రాజవరం గ్రామానికి చెందిన దాత పచ్చిపులుసు చినసత్యం(గాంధీ) కంచాలను మంగళవారం అందజేశారు. గాంధీని ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ఎల్వీ ప్రసాదరావు, ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ ఎం.భవాని, సభ్యులు చప్పిడి భాగ్యలక్ష్మి, తలిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు గోపాలపురం సర్వసభ్య సమావేశం

గోపాలపురం, ఆగస్టు 13: మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హాజరవుతారని చెప్పారు. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. గైర్హాజరైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇసుక కొరత తీరేదెప్పుడో



- 17 డీసిల్టేషన్ ర్యాంపులు గుర్తింపు..లభించని అనుమతులు
- బ్యారేజి నుంచి ఫోర్త్ బ్రిడ్జిలోపు ర్యాంపుల నిర్వహణ ఇరిగేషన్‌కు
- ఫోర్త్ బ్రిడ్జి అవతల మైన్స్‌కు అప్పగింత
- ఈ వారంలో మొదలు కానట్టేనా?
- ఇసుకకు వినియోగదారుల ఎదురుచూపు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక కొరత ఇపుడే తీరేలా లేదు. నిబంధనల ప్రకారం ఏదైనా పని చేయాలంటే ఎంత కష్టమో ఈ ఇసుక విధానం చూసి అర్థంచేసుకోవచ్చు. గత ప్రభుత్వం నిబంధనలన్నీ తుంగలో తొక్కి, అధికారుల నోటిపై వేలు పెట్టుకోమని బెదిరించి, ఇసుక ఇష్టానుసారం దోచేసి, అమ్ముకుని, రూ. కోట్లు గడించిన సంగతి తెలిసిందే. రూ.కోట్లు అక్రమాలు జరిగినా ఒక్క అధికారి కూడా మాట్లాడలేదు. ఇవాళ తెలుగుదేశం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయడానికి అనేక నిబంధనలు తెరమీదకు వచ్చాయి. అధికారులు అనేక చట్టాలను వెలికి తీసి చూపిస్తున్నారు. అన్ని అనుమతులు ఉంటేనేగానీ ఇసుక తీయలేమని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం కూడా అధికారుల మాటకు విలువ ఇచ్చే. ఒకటి రెండు రోజులు ఆలస్యమైనా పద్ధతి ప్రకారమే ఉచిత ఇసుక అమలు చేసి, ఎక్కడా ఎవరికీ అందలేదనే చెడు రాకుండా చూడాలని స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించాయి. జూలై 8 నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చినప్పటికీ, ఇంకా ఇసుక తీత మొదలు కాలేదు. గత ప్రభుత్వం హయాంలో నిబంధనల విరుద్ధంగా తవ్వేసి, మళ్లీ వాళ్ల ప్రభుత్వమే వస్తుందనే దురాశతో జిల్లాలో పలు చోట్ల ఇసుకను స్టాక్ చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక విధానం ప్రకటించి మొదట ఈస్టాక్ పాయింట్లలోని ఇసుకను సరఫరా చేశారు. జిల్లాలో ఇంచుమించు ఇసుక స్టాక్ అయిపోయినట్టే. రాజమహేంద్రవరం డివిజన్‌లో అసలు లేదు. కొవ్వూరు డివిజన్‌లో కూడా రేపోమాపో అంతా ఖాళీ. ఈ పరిస్థితులలో ఇసుక కొరత లేకుండా చూడాలని ప్రభుత్వం, జిల్లా ఇసుక కమిటీ ప్రయత్నాలు చేస్తోంది. కానీ నిబంధనలు అడ్డు వస్తున్నాయి. వీటిపై స్పష్టత రాగానే కొంతమేరైనా ఇసుక తీత తీసే అవకాశం ఉంది. ప్రస్తుతం వరద కారణంగా ఓపెన్ రీచ్‌ల జోలికి వెళ్లడంలేదు. ఇసుక కొరత లేకుండా చూడడం కోసం అఖండగోదావరిలో డీసిల్టేషన్ ద్వారా ఇసుక తీసి సరఫరా చేయడానికి నిర్ణయించారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల్లో మొత్తం 17 డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. వీటిని ఎవరికి అప్పగించాలి, ఎవరితో ఎలా ఇసుక తీయించాలనే దానిపై స్పష్టతకు అధికారులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం ఈ పాయింట్లను క్లస్టర్లుగా విభజించి, ఆన్‌లైన్ టెండర్లు పిలవాలని చూస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజి నుంచి గోదావరి ఫోర్త్ బ్రిడ్జి అయిన గామన్‌బ్రిడ్జి వరకూ రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల మధ్య అఖండగోదావరిలో డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా ఇసుక టెండర్లు పిలవడం, తీయించడం, సరఫరా చేయించే బాధ్యత ఇరిగేషన్ శాఖకు ప్రభుత్వం అప్పగించింది. గామన్ బ్రిడ్జి అవతల డీసిల్టేషన్ పాయింట్ల నిర్వహణ బాధ్యతను మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించింది. గతంలో మాదిరిగా ర్యాంపుల కింద కాకుండా రాజమహేంద్రవరం అర్బన్, రాజమహేంద్రవరం రూరల్, వెంకటనగర్, వాడపల్లి, ఎర్రమ్మఘాట్, అరికిరేవుల, దొండగంటి రేవు, తాళ్లపూడి, ప్రక్కిలంక తదితర డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. వైసీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.268 కోట్ల విలువైన ఇసుక డ్రెడ్జింగ్ ఆర్డర్ పొందిన రాఘవా కన్‌స్ట్రక్షన్‌ను కొనసాగించాలా, వద్దా అనే దానిపై కూడా స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ కంపెనీకి అనుమతిస్తే డ్రెడ్జింగ్ ద్వారా కరవుతీరా ఇసుక తీసే అవకాశం ఉంది. అప్పట్లో అఖండ గోదావరిని డ్రెడ్జింగ్‌తో కుళ్లబొడిచి, పర్యావరణాన్ని దెబ్బతీసిన సంగతి తెలిసిందే. కనీసం ఎంత ఇసుక తవ్వారో, ఎంత అమ్మారో అనే బిల్లులు లేకుండా చేశారు. కానీ ఇవాళ అసలు ఇసుకను ఇరిగేషన్ ఆధ్వర్యంలో తీయించాలా, మైన్స్ ఆధ్వర్యంలో తీయించాలనే విషయం మీద పెద్ద చర్చ జరిగింది. అందుకే అన్ని నిబంధనలు పాటిస్తూ బ్యారేజీ నుంచి ఫోర్త్ బ్రిడ్జి వరకూ ఇరిగేషన్, తర్వాత మైన్స్‌తో పనిచేయడానికి నిర్ణయించారు. గతంలో మైన్స్ లేదు.. ఇరిగేషనూ లేదు. వైసీపీ ఇష్టానుసారం జరిగింది. ప్రభుత్వం నుంచి స్పష్టత రాగానే టెండర్లు పిలిచి ఇసుక తీత ప్రారంభించనున్నారు.ఈ వారంలో రెండు పబ్లిక్ హాలిడేలు ఉండడం వల్ల వచ్చే వారం వరకూ ఇసుక తీత, సరఫరా ప్రారంభం కాకపోవచ్చు. కానీ రేపోమాపో ఆర్డర్ వస్తే కొంత త్వరగానే ప్రారంభించే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో భవన నిర్మాణదారులు కొంతం ఓపిక పట్టవలసిందే.

# కొవ్వూరు-పోలవరం పర్యాటకంగా అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో గ్రౌండును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 13: కొవ్వూరు నుంచి పోలవరం వరకు పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని కుమారదేవం గ్రామంలో నేలకూలిన సినిమా చెట్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ చెట్టు కారణంగా సినిమా వాళ్లను చూశామని గ్రామస్థులు అంటున్నారన్నారు. కాలుష్య నివారణకు, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి చెట్టు నాటి సంరక్షించాలన్నారు. అడవులను కాపాడుకోవలసిన పరిస్థితి ఉండదన్నారు. పడిపోయిన సినిమా చెట్టును నిలబెట్టడానికి రోటరీ క్లబ్ ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. కొవ్వూరు-పోలవరం రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులకు ఆహ్లాదాన్ని అందించేలా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, గొరిజాల సురేష్, సూర్యదేవర రంజిత్ పాల్గొన్నారు.

### వేగేశ్వరపురం జూనియర్ కళాశాల సందర్శన

తాళ్లపూడి, ఆగస్టు 13: వేగేశ్వరపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించి విద్యార్థులను అడిగి అక్కడి ఇబ్బందులను, మౌలిక వసతులపై ఆరా తీశారు. వర్షం నీటితో మునిగిపోయి ఉన్న గ్రౌండ్ సమస్యను ఎన్ఆర్ఈజీఎస్ పనుల ద్వారా చేపడతామని ఆయన చెప్పారు. అలాగే బిల్డింగ్ లీకులు, టాయిలెట్ సమస్యలు, తాగునీరు, తరగతి గదుల్లో ఫ్యానులు వంటి సమస్య లను పరిష్కరిస్తామని, బస్‌పాసుల కోసం కొవ్వూరు డిపోకు వెళ్లనవసరం లేకుండా కాలేజీలోనే ఇచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం ఉన్నత పాఠశాలలో హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా చేప ట్టాలని ఎమ్మెల్యే ముప్పిడి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెలే టీవీ రామారావు, కంఠమణి రామకృష్ణ, మద్దిపట్ల శివ రామకృష్ణ, నామన పరమేశ్వరరావు, కైగాల శ్రీనివాసు, కైగాల రాంబాబు, గంటా కృష్ణ, ఇందుగుల రామకృష్ణ, ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ, నాడు-నేడు డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.


కొవ్వూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు


ఉండ్రాజవరం: తాడిపర్రులో జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలి


- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పరిమి రాధాకృష్ణ
- పలుచోట్ల హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు

కొవ్వూరు, ఆగస్టు 13: ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పరిమి రాధాకృష్ణ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వూరులో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్కృత పాఠశాల నుంచి మెయిన్‌రోడ్ మీదుగా మెరకవీధి, రౌండ్‌పార్కు, రైల్వేస్టేషన్ మీదుగా సంస్కృత కళాశాల వరకు త్రివర్ణ పతాకాలతో బైక్ ర్యాలీ కొనసాగింది. రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి భారతీయుడిలో జాతీయభావం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో మాటల్ల అంజనేయులు, బీవీ ముత్యాలరావు, పిక్కి నాగేంద్ర, మడిచర్ల రామచంద్రరావు, సాయిరాజు, బరద్వాజ శర్మ పాల్గొన్నారు.

**నిడదవోలు:** నిడదవోలులో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ బి.మేరీసుజాత మాట్లాడుతూ ఈ నెల 15న ప్రతిఒక్కరూ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనాలని, జాతీయ జెండాను ప్రతి ఇంటిపై ఆవిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.హరీష్, ఎన్ఎస్ఎస్ పీవో బి.ఏసురత్నం, రామ్మోహనరావు, బాలకృష్ణ, ఉషారాణి, సునీత పాల్గొన్నారు. అలాగే నిడదవోలులో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ పతాకంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గణేష్ చౌక్ సెంటరులో రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు నీలం రామారావు, కట్టుంగ అచ్చయ్య, బలిజేపల్లి సూర్యనారాయణమూర్తి, భీమేశ్వరరావు, కుడిపూడి నరేష్ పాల్గొన్నారు.

**దేవరపల్లి:** దేవరపల్లిలో బస్టాండ్ నుంచి మూడు రోడ్ల సెంటర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ జరిపి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పి.బాలసురేష్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహానుభావులకు రుణపడి ఉంటామని, వారిని ఎప్పుడు స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలదాసు, అప్పారావు, ఎంపీడీవో ప్రభాకరరావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, హెచ్ఎం శ్రీలక్ష్మి, గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం:** మండలంలోని దమ్మెన్ను, తాడిపర్రు గ్రామాల్లో జాతీయ జెండాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు గెడ్డం రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు వై.భార్గవిదేవి, పి.సత్యనారాయణ, వీఆర్వో లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు


దేవరపల్లిలో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

# అనుమానం..పెనుభూతమై

- భార్యను హత్య చేసిన భర్త
- సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ఘటన


మృతురాలు దివ్యభారతి

సీతానగరం, ఆగస్టు 13: ఆమె అందమే ఆమెకు శత్రువైంది. అనుమానపు భర్త చేతిలో హత్యకు కారణమైంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి తన భార్యను దారుణంగా హత్యచేశాడు. స్థానికుల వివరాల ప్రకారం.. దేవీపట్నం మండలం దండంగి గ్రామానికి చాట్ల జాను, అంగులూరుకు చెందిన దివ్య భారతి(30) భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో ప్రభుత్వం లోతట్టు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించడంతో జాను కుటుంబం పురుషోత్తపట్నం వచ్చి ఓ కాలనీలో జీవనం సాగిస్తున్నారు. భారతి అందంగా ఉండడంతో మొదటి నుంచి జాను అనుమానం కలిగి ఉన్నాడు. ఈ క్రమంలో ఆమెను ఇబ్బందులకు గురిచేస్తుండడంతో గతంలో ఒకసారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొంతకాలం కోర్టులో నడిచింది. తరువాత పెద్దమనుషుల కృతంగా సర్దుబాటుచేసుకున్నారు. అయినప్పటికీ అనుమానం పోలేదు. భారతి తల్లి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా సేవలు చేసేందుకు వెళ్తానని భర్తను కోరగా అందుకు ఒప్పుకోలేదు. అయినా తల్లిపై మమకారంతో ఆసుపత్రికి వెళ్లింది. దీంతో మళ్లీ ఇద్దరి మధ్య తగవు జరగడంతో విసిగిపోయిన భారతి తన భర్తతో జీవితం ఇలానే ఉంటుందని ఇక కాపురం చెయ్యలేనని విడాకుల కోసం ప్రయత్నాలు చేపట్టింది. దీంతో ఆగ్రహానికి గురైన జాను మంగళవారం ఉదయం తొర్రిగడ్డ పాత పంపింగ్ స్కీం వద్ద బహిర్భూమికి వెళ్లిన భార్యపై పోటకత్తితో పోటకత్తితో వెనుక నుంచి తల, మెడపై నిర్దాక్షిణ్యంగా నరికి చంపాడు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి సరిపల్లి చిట్టియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ సమర్ప ణరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

# అధికారుల నిర్లక్ష్యం

- నేటికీ బయటరాని డ్రెడ్జింగ్ నావ
- గేటు మూయడానికి అడ్డంకి
- పట్టించుకోని హెడ్ వర్క్స్ ఈఈ
- మునిగిన పడవను పరిశీలించిన డెల్టా సీఈ, ఇరిగేషన్ ఎస్ఈ



ధవళేశ్వరం, ఆగస్టు 13: గోదావరి నీటి మట్టం పెరగడంతో లంగరు వేసిన ఇసుక డ్రెడ్జింగ్ నావ ప్రవాహానికి కొట్టుకు వచ్చి కాటన్ బ్యారేజ్ 1వ గేటును ఢీకొట్టి గేటుకు అడ్డంగా మునిగిపోయి 23 రోజులు గడిచిపోయినా ఇప్పటికీ నావ అలాగే మునిగిపోయి ఉంది. దానిని బయటకు తీయడానికి యజమాని రకరకాలుగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. గోదావరికి వరద ప్రవాహం పెరగడంతో ఇరిగేషన్ అధికారులు ప్రయత్నాలు నిలిపివేయించారు. బ్యారేజీ గేటు వద్ద నావ మునిగి గేటును ఆపరేట్ చేయడానికి అడ్డంకిగా మారినా.. బ్యారేజ్‌ను పర్యవేక్షించాల్సిన హెడ్‌వర్క్స్ ఈఈ మొక్కుబడిగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లిపోవడం గమనార్హం. ఈ సంఘటన కలెక్టర్ దృష్టికి వెళ్లి బ్యారేజ్ గేటుకు ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించినా డివిజన్ అధిపతిగా సలహాలు, సూచనలు ఇస్తూ పర్యవేక్షించాల్సిన హెడ్ వర్క్స్ ఈఈ బ్యారేజ్ సెక్షన్ ఏఈలకు నావను బయటకు తీయించే బాధ్యతను అప్పగించి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోదావరిలో నీరు తగ్గుతూ ఉండటంతో గేట్లను దించి నీటి విడుదలను నియంత్రించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఏ విధంగానైనా అక్కడ నుంచి నావను తీయాల్సిన పరిస్థితుల్లో మంగళవారం ఉదయం డెల్టా సీఈ ఎస్.పుల్లారావు, సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కలిసి నావ మునిగిన ప్రాంతాన్ని పరిశీలించి నావను బయటకు తీయడానికి నావ ఓనర్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఏఈలకు సూచించారు. అలాగే నావను బుధవారం నాటికి బయటకు తీయని పక్షంలో ముక్కలుగా తీసి తొలగించాల్సి ఉంటుందని నావ యజమానులను హెచ్చరించారు.

### మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


డ్రగ్స్ వినియోగంపై మాట్లాడుతున్న సీడీపీవో మమ్మీ

చాగల్లు, ఆగస్టు 13: సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ క్రైమ్ ద్వారా మహిళలపై జరుగుతున్న నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ కొవ్వూరు సీడీపీవో మమ్మీ అన్నారు. మంగళవారం చాగల్లు జూనియర్ కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ ద్వారా ఎటువంటి న్యాయం పొందవచ్చుననే అంశంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులతోపాటు వివిధ శాఖల అధికారులు దృష్టిసారించి మార్గనిర్దేశం చేయాలన్నారు. వ్యసనాలకు అలవాటు కాకుండా దూరం గా ఉంచేలా ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.పావని, తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంఈవోలు యు.గురునాథం, సీహెచ్ సుభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, శిరీష పాల్గొన్నారు.

## సంపద తయారీ కేంద్రాలు పునరుద్ధరించాలి


దేవరపల్లి: రామన్నపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ప్రభాకరరావు

కొవ్వూరు, ఆగస్టు 13: అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునరుద్ధరించాలని ఎంపీడీవో కె.సుశీల అన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రిఫ్రెషన్ శిక్షణా తరగతుల్లో భాగంగా మండలంలోని ఐ.పంగిడి సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంటు(ఎస్‌డబ్ల్యూఎం) పథకాన్ని సందర్శించారు. దీనిపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్‌లకు అవగాహన కల్పించి శిక్షణ అందించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూఎం కేంద్రాలను పునరుద్ధరించి, వర్మీకంపోస్టు తయారీ ప్రారంభించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.శర్మ, సర్పంచ్ గోశాల నాగార్జున, రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు, మాస్టర్ ట్రైనీలు వై.అలేఖ్య సువర్చలా, సీహెచ్ అశాఅలేఖ్య, డి.ముత్యం, పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

**దేవరపల్లి:** రామన్నపాలెంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరరావు మాట్లాడుతూ పారిశుధ్య వ్యర్థాలు, చెత్త సేకరించి పొడిచెత్త, తడి చెత్తగా వేరు చేసి వర్మీ కంపోస్టు తయారుచేసే విధానాన్ని వివరించారు. వర్మీకంపోస్టు మార్కెట్ చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం పాటు రైతులకు తక్కువ ధరకు ఎరువులు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఎస్.రవికిషోర్, రామచంద్రరావు, సర్పంచ్‌లు కె.బుల్లారావు, బొంతా నాగమణి, కె.పరమేశ్వరరావు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

**కొవ్వూరు**

| | |
|---|---|
| యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1 | మురారి |
| వై.స్క్రీన్2 | తుఫాన్ |
| దేవిశ్రీ(గాయత్రి | బడ్డీ |
| అనన్య | కమిటీ కుర్రోళ్లు |

**నిడదవోలు**

| | |
|---|---|
| వీ మ్యాక్స్ | కమిటీ కుర్రోళ్లు |
| రాధాకృష్ణ | రాయన్ |
| శ్రీగణపతి | పురుషోత్తముడు |

**దేవరపల్లి**

| | |
|---|---|
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | కమిటీ కుర్రోళ్లు |
| శ్రీరామ్ సినీ మ్యాక్స్ | కమిటీ కుర్రోళ్లు |

**నల్లజర్ల**

| | |
|---|---|
| శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1 | --- |
| స్క్రీన్ 2 | --- |
| శ్రీనివాస | --- |